ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | బుధవారం | 09.09.2026 | సంపుటి : 2 | సంచిక : 68 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్

# తిట్టింది నా తల్లిని.. నీ తల్లిని కాదు

## ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి

హరీశ్‌రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం

మహిళా ఎమ్మెల్యేల అంశంపై బీఆర్ఎస్ నిరసన

రెండోరోజూ సభను కుదిపేసిన అసెంబ్లీ వద్ద జరిగిన ఘటన

తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో నిన్న ఉదయం జరిగిన ఘటనలపై ఇవాళ కూడా సభలో వాగ్యుద్ధం జరిగింది. ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి అంటూ..ఒక దశలో స్పీకర్ ప్రసాద్‌కుమార్.. హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో రోజు సభ ప్రారంభమైన వెంటనే నల్లబ్యాడ్జీలతో భారత రాష్ట్రసమితి సభ్యులు హాజరయ్యారు. సీనియర్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆవేశంగా మాట్లాడారు. రాష్ట్రంలోని యావత్ మహిళలపై జరిగిన దాడిగా దీన్ని పరిగణిస్తున్నామన్నారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 8 : రెండోరోజూ శాసనసభ అట్టుడికింది. మంగళవారం జరిగిన సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య, స్పీకర్–హరీశ్‌రావు మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఉదయం సభ ప్రారంభం కాగానే సోమవారం అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణ.. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై పోలీసులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం.. అదే సమయంలో సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యల వివాదం సభను కుదిపేసింది. సభలో సభ్యులను ఉద్దేశించి అంతగా మాట్లాడని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ తీవ్ర భావోద్వేగానికి గురై హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ సభ్యులు నల్లబ్యాడ్జీలతో నిరసనకు దిగారు. హరీశ్‌రావు లేచి సోమవారం జరిగిన ఘటనను ప్రస్తావించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై పోలీసులు దాడి చేశారని ఆరోపించారు. 'మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగింది. వారిపై కేసులు పెట్టారు. మరి వారిపై దాడి చేసిన పోలీసులపై ఏం చర్యలు

-మిగతా 2 లో..



# కేసీఆర్ హత్యకు కుట్ర

## పోలీసులపై మాకునమ్మకం లేదు

మన నాయకుడు కేసీఆర్‌ను మనమే కాపాడుకోవాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్తుండగా కేటీఆర్, హరీశ్‌రావు అరెస్ట్?

బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద రణరంగం..

రాళ్లు, కుర్చీలతో బీఆర్ఎస్, కాంగ్రెస్ దాడులు

హైదరాబాద్,సెప్టెంబర్8 : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. కాంగ్రెస్ నేతలు డప్పులతో ఎర్రవల్లి ఫాంహౌజ్ ముట్టడించడానికి ప్రయత్నించిన సందర్భంగా.. కేసీఆర్‌ను పరామర్శించేందుకు, ఆయనకు రక్షణగా ఎర్రవల్లికి బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు.. హకీంపేట వద్ద అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సంచలన ఆరోపణలకు తెరతీశారు. కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్‌పై కుట్రపూరితంగా హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న సమయంలో పోలీసులు కేటీఆర్‌ను అదుపులోకి తీసుకుని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్

మిగతా 2 లో



## ప్రధాని పర్యటనలో తుపాకీ కలకలం

పీఎంవో అధికారినంటూ ఎంట్రీకి యత్నం

03



## గ్యాంగ్‌రేప్ కేసులో ఉరిశిక్ష

పోక్సో కోర్టు సంచలన తీర్పు

04

# ఫామ్‌హౌస్‌లో జరిగిన కుట్రే

## సభ్యులతో అమలు చేయిస్తున్నారు

బీఆర్ఎస్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపాటు।

కేసీఆర్ క్షమాపణ చెప్పాలని, ఇద్దరు సభ్యులపై చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానం

హైదరాబాద్, సెప్టెంబర్ 8 : శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తించిన తీరు యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని, ఇది కేవలం ఒక వ్యక్తికి జరిగిన అవమానం కాదని, మొత్తం చట్టసభకు జరిగిన ఘోర అవమానమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో రచ్చ ఆషామాషీగా జరిగింది కాదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందని చెప్పారు. ఈ నెల 7 నుంచి శాసన సభ సమావేశాలు ప్రారంభమైతే..ఒక రోజు ముందు 6వ తేదీన

-మిగతా 2 లో..





# ఫీజు బకాయిలు విడుదలయ్యేలా జోక్యం చేసుకోండి

## గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు బీజేపీ నేతల వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 8 : రాష్ట్రప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.15,000 కోట్ల ఫీజు బకాయిల విడుదలపై జోక్యం చేసుకోవాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను భాజపా బృందం కోరింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు నేతృత్వంలో మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌కు వినతి పత్రం అందజేసింది. అనంతరం రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థులకు రూ.15,000 కోట్ల బకాయిలు ప్రభుత్వం చెల్లించాలి. వెంటనే విడుదల చేయించేలా చూడాలని గవర్నర్‌ను కోరాం. భాజపా ఆందోళనల వల్లే ఈ విద్యాసంవత్సరం కొత్తగా చేరిన విద్యార్థులకు నామమాత్రంగా నిధులు మంజూరయ్యాయి. కానీ పాత బకాయిలు అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఒక్కరోజైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రత్యేక చర్చ నిర్వహించాలి"

-మిగతా 2 లో..



# తాతా మధు, నవీన్‌రెడ్డి సస్పెన్షన్

## సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు

ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం

హైదరాబాద్, సెప్టెంబర్ 8 : తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## బీఆర్ఎస్ సభ్యులు నిషేధాజ్ఞలు ఉల్లంఘించారు

హైకోర్టుకు తెలిపిన ఏజీ సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 8 : అసెంబ్లీ వద్ద సోమవారం జరిగిన ఘటనపై తెలంగాణ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఆ ఉత్తర్వులను సవరించాలని కోరింది. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చర్యలు

-మిగతా 2 లో..






## మరిన్ని రూట్లలో నైట్ షిఫ్ట్ బస్సు సర్వీసులు

తెలంగాణ రాష్ట్ర టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం

03

## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షు డు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూ లంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు.

03





## ఆవేశం మీకు కాదు..
# నాకు ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు? ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. హరీశ్ మాటలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వెంటనే స్పందించారు. మహిళా సభ్యుల పట్ల తనకు పూర్తి గౌరవం ఉందని స్పష్టం చేశారు. జరిగిన ఘటనపై ఇప్పటికే పోలీసుల నుంచి నివేదిక కోరినట్టు చెప్పారు. నివేదిక వచ్చిన తర్వాత తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటానన్నారు. స్పీకర్ సమాధానంతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ సభ్యులు నిరసన కొనసాగించారు. ఈ క్రమంలో స్పీకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ బెదిరింపులకు నేను భయపడను. మీరు చేస్తున్నది తప్పు'అంటూ ప్రతిపక్ష సభ్యులను హెచ్చరించారు. అంతలోనే అసెంబ్లీ బయట తనపై, తన తల్లిపై చేసిన వ్యాఖ్యల అంశాన్ని స్పీకర్ ప్రస్తావించారు. 'మీరెందుకు ఆవేశపడుతున్నారు హరీశ్ ? నా సంగతేంటో చెప్పు? మీ తల్లిని ఎవరూ తిట్టలేదు. నా తల్లిని తిట్టారు. మీరు ఆవేశపడాల్సిన అవసరం లేదు. ఆవేశపడాల్సింది నేను. బీఆర్ఎస్ నాయకులు మీ తల్లి గురించి మాట్లాడలేదు.. నా తల్లి గురించి మాట్లాడారు. దీనిపై ఏం చేద్దామో ముందు చెప్పండి'అని స్పీకర్ తీవ్ర భావోద్వేగానికి గురవడంతో సభలో కొద్దిసేపు నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.

### స్పీకర్‌ను బెదిరించేలా బీఆర్ఎస్ సభ్యుల తీరు: శ్రీధర్‌బాబు

శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు(రాతీఅస్త్రుతీ ధీుఎబ) మాట్లాడుతూ... స్పీకర్‌ను బెదిరించేలా బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉందన్నారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిపై ఇలా మాట్లాడటం ఎప్పుడూ చూడలేదన్నారు. స్పీకర్‌పై బెదిరింపు ధోరణితో సభ నడవదని గుర్తించాలన్నారు. "సభలో ఇబ్బందులు ఉన్నట్లు గుర్తిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు. సభ అందరిది.. సభను ఎలా నడపాలో మీరు ఎలా చెబుతారు? స్పీకర్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎలా మాట్లాడుతారు. స్పీకర్ పట్ల మాట్లాడలేదు.. అలా భావిస్తే ఉప సంహరణ అంటున్నారు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు వీడియోలో స్పష్టంగా కనిపించాయి. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై రికార్డులను ప్రజల ముందుంచితే స్పష్టత వస్తుంది. మహిళా సభ్యుల విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నా పట్టించుకోవట్లేదు. స్పీకర్ పట్ల దుర్భాషలాడిన విషయాన్ని పక్కన పెట్టాలని బీఆర్ఎస్ సభ్యులు చెబుతున్నారు. స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడితే తప్పని చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉంది" అని శ్రీధర్‌బాబు అన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల పట్ల క్షమాపణలు చెప్పకుండా బీఆర్ఎస్ సభ్యులు రాజకీయం చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ఫామ్‌హౌస్‌లో జరిగిన కుట్రే

(మొదటిపేజీ తరువాయి)

ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ఎల్పీ సమావేశం పెట్టి కుట్రకు తెరలేపారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఉగ్రవాద సంస్థలు తమ భావజాలాన్ని నూరిపోసి పంపించిన తరహాలో బీఆర్ఎస్ సభ్యులను ప్రేరేపించి పంపించారని విమర్శించారు. కుట్రదారుల డైరెక్షన్‌లో కొందరు బీఆర్ఎస్ సభ్యులు పాత్రధారులుగా సభలో ప్రవర్తించారని, ప్రధాన సూత్రధారులు బీఆర్ఎస్ అత్యున్నత నాయకత్వమేనని విమర్శించారు. స్పీకర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం శాసనసభలో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రతిపాదించిన తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తూ డిప్యూటీ సీఎం మాట్లాడారు. సభాపతి తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం.. తెలంగాణ సమాజం సంస్కారం, సంస్కృతి, మహిళల గౌరవానికి సంబంధించిన సమస్య అని భట్టి విక్రమార్క అన్నారు.

### రూపుమాపని మానసిక అస్పృశ్యత: దామోదర

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా మానసిక అస్పృశ్యత రూపుమాపలేదని మంత్రి దామోదర రాజనర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. 'మాకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదు. దళితుల చరిత్ర అంటే పోరాటాల చరిత్ర. ఆత్మగౌరవ చరిత్ర. ఆత్మగౌరవమే మా అలంకారం. ఆత్మగౌరవమే మా స్ఫూర్తి. ఆ ఆత్మగౌరవంతోనే ఈ స్థాయికి వచ్చాం'అని మంత్రి అన్నారు. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరిగితే యువత తిరగబడుతుందని, ముఖ్యంగా దళిత సమాజాన్ని తక్కువ అంచనా వేయొద్దని హెచ్చరించారు. చిన్న వయసులోనే తల్లిని కోల్పోయి, ఎన్నో కష్టాలను అధిగమించి అంచెలంచెలుగా ఎదిగి శాసనసభ స్పీకర్‌గా ఉన్నత స్థానానికి చేరుకున్న గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అవమానించడం బాధాకరమన్నారు.



## ఫీజు బకాయిలు విడుదలయ్యేలా జోక్యం చేసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. గౌతమ్‌రావు, టి.వీరేందర్‌గౌడ్, వేముల అశోక్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, కల్యాణ్ నాయక్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడిపై చర్యలేవి?

### వారికి జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుంది

### దాడిపై అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు



**హైదరాబాద్,సెప్టెంబర్8 :** బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ వద్ద జరిగిన అమానుష ఘటనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుందని హరీష్ రావు అన్నారు. అయితే అవమానం జరిగింది నీ తల్లికి కాదు, మా అమ్మకు అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడిలో పోలీసులపై చర్యలను మంత్రి శ్రీధర్ బాబు పరిశీలిస్తామని అన్నారు. సబితక్క గొంతునొక్కారు, మగ పోలీసులు ఈ పని చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంటే.. దీనిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డిని చీర లాగి అవమానిస్తే.. ఆ పోలీసులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా వీరిపైనే కేసులు నమోదు చేసి వేధించడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిపోయి, వారిపై కేసులు నమోదు చేసి వేధించడంపై హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇది గౌరవసభ కాదని, కౌరవ సభగా మారిందంటూ మండిపడ్డారు. ఆనాడు కౌరవులకు పట్టిన గతే మీకు పడుతుందని, ఈ విషయాలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురించి మాట్లాడుతూ.. మీరంటే నాకు చాలా గౌరవం, చాలా ఇష్టం. చాలా ఏళ్ల నుంచి సభలో మీతో కలిసి పనిచేశాం. ఎమ్మెల్సీ తాతా మధు తాను స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ మీరు మిమ్మల్ని అన్నారని భావిస్తే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానంటూ విచారం వ్యక్తం చేశారు. మీ ప్రభుత్వానికి నిజంగానే ఎస్సీ, ఎస్టీలపై చిత్తశుద్ధి ఉంటే డిక్లరేషన్ ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయకుండా తాళం ఎందుకు వేశారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. మహిళా ప్రజాప్రతినిధులను ప్రభుత్వం గౌరవిస్తుంది. సభాధ్యక్షుడిగా నాకు కూడా గౌరవం ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అయితే మహిళా ఎమ్మెల్యేలపై కేసులు పెట్టారని హరీష్ రావు ప్రస్తావించగా.. మీరు చెప్పింది మేం విన్నాం. మేం చెప్పింది కూడా వినండి. హరీష్ రావు మీకు కాదు, నాకు ఉండాలి ఆవేశం. వాళ్లు అన్నది నీ తల్లిని కాదు, నా త్లలిని అవమానించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీలు నాకు సోదరిమణుల్లాంటి వారు. వారిపట్ల నాకు గౌరవం ఉంది. నా తల్లిని మాటలు అన్నారు, అనుచిత వ్యాఖ్యలు చేశారు దీనికి ఏం సమాధానం చెబుతావు హరీష్ రావు అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభలో గట్టిగానే ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద సోమవారం నాడు సభ్యుల తీరుపై మంత్రి సీతక్క అసెంబ్లీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని, స్పీకర్‌ను, ఆయన తల్లిని దూషించడం కరెక్టేనా అని నిలదీశారు. పోలీసులపై దాడి చేసిన, స్పీకర్‌ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో రూల్స్ తెచ్చిన నేతలే వాటిని ఉల్లంఘిస్తూ అసభ్యకర భాషతో మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అయితే, తమ చీరలు లాగి కొట్టారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. నిజంగా దాడి జరిగితే విచారించి బాధ్యులైన పోలీసులపై కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని సీతక్క స్పష్టం చేశారు.

## తాతా మధు, నవీన్‌రెడ్డి సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)



ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు. కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.





## బీఆర్ఎస్ సభ్యులు నిషేధాజ్ఞలు ఉల్లంఘించారు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించారని హైకోర్టుకు ఏజీ తెలిపారు. ప్లకార్డులు, వ్యతిరేక రాతలతో ఉన్న నల్ల టీషర్టులు ధరించి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారని.. భయానక వాతావరణం కల్పించేలా వ్యవహరించారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారని ఏజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులు నియమావళిని ఉల్లంఘించినందునే పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నిషేధాజ్ఞలు ఉల్లంఘించారన్నారు. విధుల్లో ఉన్న పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లను నెట్టివేసి దూషించారని చెప్పారు. వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుంది కదా? అని హైకోర్టు ప్రశ్నించగా.. స్పీకర్ ఆదేశాలతోనే శాసనసభ్యులను పోలీసులు అడ్డుకున్నారని ఏజీ తెలిపారు.

# కేసీఆర్ హత్యకు కుట్ర..

(మొదటిపేజీ తరువాయి)

శ్రేణులు అరాచ కానికి పాల్పడ్డాయని ఆరోపించారు. కేసీఆర్ ఫాంహౌజ్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. అదే సమయంలో తమ సొంత నాయకుడి నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. దీనిపై డీజీపీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నారని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ నివాసం వైపు కాంగ్రెస్ నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసులను మోహరించామని అధికారులు చెప్పినప్పటికీ.. తమ నాయకుడి భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తమ నాయకుడిని తామే కాపాడుకోవాలి అంటూ బీఆర్ఎస్ నేతలు ముందుకు సాగారు. అసెంబ్లీ నుంచి కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లి బయలుదేరారు. తొలుత బొల్లారం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను నిలిపివేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కేసీఆర్ ఇంటి వైపు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులకు అనుమతి ఇచ్చారా అని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. కేసీఆర్ నివాసం వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు వివరించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వెనక్కి తగ్గలేదు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా బయలుదేరారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రతిపక్షాలపై దృష్టి పెట్టిందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు తెరలేపిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకునే వరకు, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల తీరుపైనా కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించడానికే సభను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఒక రోజు రాజకీయ విమర్శలకు కేటాయించి, మిగిలిన సమయాన్ని ప్రజా సమస్యలపై చర్చించేందుకు వినియోగించాలని సూచించారు. దళితులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. దళితబంధు పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పటివరకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతల అరెస్ట్‌తో మేడ్చల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్? చేస్తున్నారని మాజీమంత్రి హరీశ్?రావు విమర్శించారు. సభలో సమస్యలు చర్చించకుండా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికితే రేవంత్ రెడ్డికి కనపడలేదని, మహిళ ఎమ్మెల్యేలు ఫిర్యాదు ఇస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు ఏమనుకుంటారోనన్న జ్ఞానం లేదా అని నిలదీశారు. రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కౌరవులకు పట్టిన గతి కాంగ్రెస్?కు పడుతుందని హరీశ్? వ్యాఖ్యానించారు. బీజేపీ సభ్యులు ప్లకార్డులతో అసెంబ్లీలోకి వెళ్లారన్న హరీశ్?, దీన్నిబట్టే బడే భాయ్ చోటే భాయ్ బంధం అర్థం అవుతోందన్నారు. సీఎం చేతకాని తనం వల్ల క్రాప్? హాలిడే ఇచ్చే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడతామని స్పష్టంచేశారు. ఎవరిది అసభ్యకర భాష, ఎవరిది వికృత భాష అని ప్రజలు గమనిస్తున్నారు. కేసీఆర్ ఇంటి మీద ముఖ్యమంత్రి దాడికి ఉసిగొల్పారు. దీనిపై కేంద్రం జోక్యం చేసుకోవాలి. రేవంత్ రెడ్డి ఎప్పుడూ కేసీఆర్ చావును కోరుకుంటారు. ఎమ్మెల్యేల చేత కేసీఆర్ చావాలని మాట్లాడిస్తున్నారు. రేవంత్ రెడ్డి అండతోనే ఎమ్మెల్యే శంకర్ కేసీఆర్?పై మాట్లాడారు. శంకర్?పై కేసుపెట్టాలి, సభ్యత్వం రద్దు చేయాలని అన్నారు. కాగా బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కేటీఆర్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడికి భారీగా చేరుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా రావడంతో ఇరు వర్గాల మధ్య నినాదాలు, వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఇరువర్గాలు రాళ్లు, కుర్చీలు విసురుకోవడంతో ఆ ప్రాంతం అంతా రణరంగంగా మారిపోయింది. పరిస్థితి అదుపు తప్పడంతో కొందరు కార్యకర్తలు కుర్చీలు, రాళ్లు విసురుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ పార్టీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఘర్షణలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు గాయపడినట్లు సమాచారం. ఓ మహిళా కార్యకర్త చేతికి తీవ్ర గాయమైందని.. చేయి విరిగినట్లు సమాచారం. అయితే గాయాలపై పూర్తి వివరాలు, ఘటనకు సంబంధించిన కారణాలపై అధికారికంగా పూర్తి సమాచారం వెలువడాల్సి ఉంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. అతి కష్టం మీద ఇరు వర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. ఈ ఘటనల నేపథ్యంలో బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ సహా బీఆర్ఎస్ నేతలను తరలించిన పోలీస్ స్టేషన్ల పరిసరాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. తమ పార్టీ నేతలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుపట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న తమ నేతలకు కూడా రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ప్రధాని పర్యటనలో తుపాకీ కలకలం

## పీఎంవో అధికారినంటూ ఎంట్రీకి యత్నం

**ముంబై, సెప్టెంబర్ 8 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు బాంద్రా–కుర్లా కాంప్లెక్స్ ( లో భద్రతా కలకలం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ పాల్గొననున్న కార్యక్రమం జరిగే ప్రాంతంలో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తాను ప్రధానమంత్రి కార్యాలయం అధికారినని చెప్పుకున్నట్లు సమాచారం. అతని వద్ద నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక వివరాల ప్రకారం, ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రాంగణంలో ఈ ఇద్దరిని గుర్తించారు. నకిలీ గుర్తింపు కార్డుతో ఉన్న వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్‌గా గుర్తించారు. అతనితో పాటు ఉన్న అంగరక్షకుడి వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో గుర్తింపు కార్డు అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించగా అది నకిలీదని తేలింది. నకిలీ గుర్తింపు కార్డును ఎలా సంపాదించాడు? తాను అధికారినని ఎందుకు చెప్పుకున్నాడు? తుపాకీతో ఉన్న బాడీగార్డుతో కలిసి ప్రధాని కార్యక్రమం జరిగే ప్రదేశంలోకి ఎందుకు రావడానికి ప్రయత్నించారు? అనే అంశాలపై ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది. అయితే, ప్రస్తుతానికి ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతో వారు అక్కడికి వచ్చినట్లు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ సెప్టెంబర్ 8న సాయంత్రం 5:45 గంటల సమయంలో ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026ను ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఈ ఏడో ఎడిషన్‌లో ఫైనాన్స్ భవిష్యత్తు, ఏజెంటిక్ , టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితంపై చర్చలు జరగనున్నాయి. అంతకు ముందు ప్రధాని గుజరాత్‌లోని వడోదరలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకిత కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో రూ.20,700 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లోని 326 రూట్ కిలోమీటర్ల మూడు కీలక విభాగాలు ఉన్నాయి.ప్రధాని ముంబై పర్యటనకు ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడటం భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేసింది. ఈ ఘటన వెనుక అసలు ఉద్దేశం ఏంటన్నది క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో తేలాల్సి ఉంది.



# బుల్లెట్ రైలు మొదటి కోచ్ సిద్ధం

## 2027లో ఆ స్టేషన్ల మధ్యే పరుగులు

**న్యూఢిల్లీ :** దేశంలో పరుగులు పెట్టేందుకు మొదటి బుల్లెట్ రైలు సిద్ధమవుతోందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. భారతదేశపు మొట్టమొదటి హై-స్పీడ్ రైలు ప్రాజెక్ట్ ముంబయి–అహ్మదాబాద్ హై–స్పీడ్ రైల్ కారిడార్ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాబోయే కొద్ది నెలల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కీలకమైన మైలురాయిని చేరుకోవచ్చని తెలిపారు. 2027లో సూరత్–బిలిమోరా స్టేషన్ల మధ్య బుల్లెట్ రైలు సేవలను ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు. 508 కిలోమీటర్ల మేర ఉన్న ముంబయి–అహ్మదాబాద్ కారిడార్‌లో ఈ సెక్షనే తొలుత ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. వాపి–సూరత్ విభాగంలో హైస్పీడ్ కారిడార్ పనులు డిసెంబర్ 2026 నాటికి పూర్తి అవుతాయని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. బుల్లెట్ రైలులోని మొదటి కోచ్ ఇప్పటికే తయారైందని, వచ్చే ఏడాది మే నెలలో ట్రయల్ రన్ కోసం దీన్ని పట్టాలపైకి తీసుకురానున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌లోని కీలక విభాగాలలో నిర్మాణాలు కొనసాగుతున్నట్లు చెప్పారు.

### ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్..

ముంబయి–అహ్మదాబాద్ హై–స్పీడ్ రైల్ కారిడార్ మహారాష్ట్ర, గుజరాత్, కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రానగర్ హవేలీ మీదుగా వెళ్తుంది. ముంబయి–అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడానికి దీనిని రూపొందిస్తున్నారు. ఈ కారిడార్‌లో తొలి హై–స్పీడ్ రైలు సర్వీసు 2027 ఆగస్టులో ప్రారంభం కానుంది. పూర్తి కారిడార్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ముందే.. సూరత్–బిలిమోరా విభాగాన్ని ప్రారంభించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

# మరిన్ని రూట్లలో నైట్ షిఫ్ట్ బస్సు సర్వీసులు

## తెలంగాణ రాష్ట్ర టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం




**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** గ్రేటర్ హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, అర్ధరాత్రి వేళల్లో ప్రజా రవాణాకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని టి.జి.ఎస్.ఆర్టీసీ ప్రారంభించిన రాత్రిపూట బస్సు సర్వీసులకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రయాణికుల విజ్ఞప్తులు, రాత్రిపూట అధిక ట్రాఫిక్ రద్దీ, ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని 2026 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో ఆరు ప్రధాన రూట్లలో రాత్రిపూట ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు.అబిడ్స్, లక్డికాపూల్, కేర్ హాస్పిటల్, అన్నపూర్ణ, ఉషాకిరణ్, గుట్లబేగంపేట్, కొండాపూర్ క్రాస్ రోడ్, హఫీజ్‌పేట్, లింగంపల్లి, రామచంద్రాపురం, బీరంగుడి మీదుగా పటాన్‌చెరు వరకు సర్వీసులు.. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ రాత్రిపూట సర్వీసుల్లో కేవలం ఏడు రోజుల్లోనే 9,286 మంది ప్రయాణికులు ప్రయాణించారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్ధరాత్రి వేళల్లో కూడా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి రావడంతో హైదరాబాద్ మహానగర ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రజల నుంచి మరిన్ని కొత్త రూట్లలో రాత్రిపూట బస్సు సర్వీసులు ప్రారంభించాలంటూ విజ్ఞప్తులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రయాణికుల డిమాండ్లను, రద్దీని, రూట్ల అవసరాలను అధికారులు సమగ్రంగా పరిశీలించి భవిష్యత్తులో మరిన్ని ప్రధాన మార్గాల్లో థర్డ్ షిఫ్ట్ సర్వీసులను విస్తరిస్తామని వెల్లడించారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసి, హైదరాబాద్ నగరంలో 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థను దశలవారీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# నగరంలో మరో భారీ ఫ్లైఓవర్..

- బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలి మధ్య నిర్మాణం!
- బిడ్లు స్వీకరిస్తున్నట్టు తెలిపిన అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** హైదరాబాద్ నగరంలో కీలక ప్రాంతమైన ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు హెచ్ఎండీఏ ఒక కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మించబోతోంది. ఈ కొత్త కారిడార్‌ను బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు నిర్మించనున్నారు. తాజాగా ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. అర్హులైన కాంట్రాక్టర్లు ఈ నెల 22 లోపు బిడ్లు దాఖలు చేయాలని పేర్కొంది. టెండర్లు ఖరారయ్యాక నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. ఈ కొత్త కారిడార్‌ను బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు దాదాపు 9 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి హెచ్ఎండీఏ దాదాపు రూ.1,656 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ కారిడార్ నిర్మాణాన్ని మొత్తం రెండు దశల్లో పూర్తి చేసేలా అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. మొదటి దశలో ఫిలింనగర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు 5 కి.మీ మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఇక రెండో దశలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హకీంపేట్ కుంట వరకు 4 కి.మీ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఈ కారిడార్ నిర్మాణం పూర్తయ్యాక రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దీనిపై దాదాపు ఆరు ర్యాంప్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఫిలింనగర్ రోడ్డు నం. 82 వద్ద, నార్నే రోడ్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 52, ఐటీసీ కోహినూర్ రోడ్, టీ–హబ్ జంక్షన్, మైండ్‌స్పేస్ వద్ద ఈ ర్యాంప్‌లను నిర్మించనున్నారు. అంతేకాదు, రాబోయే రోజుల్లో ఈ రూట్‌లో మెట్రో రైలు విస్తరణ జరిగినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ కారిడార్‌ను డిజైన్ చేశారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తై అందుబాటులోకి వస్తే ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీ చెక్‌పోస్టు, ఫిలింనగర్ మీదుగా వెళ్లే వారికి భారీ ఊరట లభించనుంది. దీనివల్ల ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. అలాగే నగర నడిబొడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్‌కు చేరుకోవడం మరింత సులభతరం కానుంది.

# చావు రాజకీయాలు చేయిస్తారా?

- కేసీఆర్‌ను అంతమొందించేందుకు కుట్ర
- కేసీఆర్ నివాసం ముట్టడి రేవంత్ ఆలోచనే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతికంగా అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు. "వెయ్యి డప్పులతో కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామన్నది శంకర్ వ్యక్తిగత మాట కాదు. అది వెనుకుండి నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనే" అని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వేళ సభ్యులను సభకు రానివ్వకుండా కేసీఆర్ ఫాంహౌస్ కు కాంగ్రెస్ శ్రేణులను పంపి దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు. హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తూ, మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు హాని తలపెట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# సౌదీపై రెచ్చిపోయిన హూతీలు..

**రియాద్:** సౌదీ అరేబియాపై యెమన్ హూతీలు రెచ్చిపోయారు. ఈ దేశంలోని పౌర సముదాయాలతో పాటు ఆర్థిక కేంద్రాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకపడ్డారు. దక్షిణ ప్రాంతంలో ఉన్న పలు ఇంధన రంగానికి చెందిన సంస్థలు, కీలక స్థావరాలే టార్గెట్‌గా దాడులు చేశారు. అయితే ఈ దాడుల్లో 73 మంది గాయపడినట్లు సౌదీ అరేబియా అధికారులు తెలిపారు. ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని పేర్కొన్నారు. కాగా ఈ దాడులు తమ చర్యలేనని హౌతీలు ప్రకటించారు. సౌదీ–యెమెన్ సరిహద్దుకు సమీపంలోని అబ్హా, జిజాన్ ప్రాంతాల్లోని ప్రభుత్వ రంగ చమురు సంస్థ అరామ్‌కోకు చెందిన సౌకర్యాలతో పాటు అబ్హా అంతర్జాతీయ విమానాశ్రయం, కింగ్ ఖాలిద్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ దాడులపై సౌదీ అరేబియా తీవ్రంగా స్పందించింది. తమ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సౌదీ స్పష్టం చేసింది. పౌరులు, ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకోవడం, ఎర్ర సముద్రంలో నౌకలపై దాడులు చేయడం తక్షణమే నిలిపివేయాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు యెమెన్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సౌదీ మద్దతుతో ఉన్న ఆ దేశ ప్రభుత్వం, హూతీల ఆధీనంలోని ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఎదురుదాడిని ప్రారంభించింది. దీనికి ప్రతిగా హూతీలు సౌదీ అరేబియాపై దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు యెమెన్‌లోని ఓ జైలుపై జరిపిన దాడిలో 11 మంది మరణించారు. దానికి ప్రతికారంగా ఈ దాడులు జరిపినట్లు హూతీలు ప్రకటించారు.

# కువైట్‌లో భారీ డీజిల్ మోసం..

## భారతీయులు సహా 41 మంది అరెస్ట్!

**కువైట్ :** ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన వాహనాల నుంచి డీజిల్ దొంగిలించి అక్రమంగా విక్రయిస్తున్న ముఠాను కువైట్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ విభాగం పట్టుకుంది. ఈ కేసులో ఓ కువైట్ పౌరుడితో పాటు భారతీయులు సహా 40 మంది ప్రవాసులను అరెస్ట్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో డ్రైవర్లుగా పనిచేస్తున్న కొందరు బస్సులు, లారీలను 'అంగర్' ప్రాంతంలోని రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి డీజిల్ చోరీ చేస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఇలా సేకరించిన డీజిల్‌ను ఇతర ట్యాంకర్లలోకి తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అక్రమ దందా కోసం ట్యాంకర్లను నెలకు 1,600 కువైటీ దినార్లకు అద్దెకు ఇచ్చింది అరెస్టైన కువైట్ పౌరుడేనని విచారణలో తేలింది. చాలాకాలంగా నిఘా పెట్టిన అధికారులు డీజిల్ చోరీ చేస్తున్న సమయంలో ప్రధాన నిందితులను పట్టుకున్నారు. అనంతరం దొంగిలించిన డీజిల్ కొనుగోలు చేసేందుకు వచ్చిన మరికొందరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అయితే, డీజిల్ దొంగతనం, విక్రయం, కొనుగోలులో భాగమైన మొత్తం 41 మందిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, ముఠా ఉపయోగించిన 38 ట్రక్కులు, బస్సులను కూడా స్వాధీనం చేసుకున్నారు. అక్రమ కార్యకలాపాలు, ఆర్థిక నష్టాన్ని అరికట్టడంలో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టినట్లు కువైట్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.



# శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

- నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

**హైదరాబాద్,సెప్టెంబర్8 :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.



# బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026

## పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు–భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

# స్కూల్ బస్సులో అకస్మాత్తుగా మంటలు

## విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం

**హైదరాబాద్,సెప్టెంబర్8 :** తెల్లాపూర్‌లోని మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సులోకి విద్యార్థులు ఎక్కుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో తీవ్ర కలకలం రేగింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే పిల్లలను బస్సుకు దూరంగా తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. ఒకటో తరగతి విద్యార్థులు బస్సు ఎక్కుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం. క్షణాల్లోనే మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుంది. పరిస్థితిని గమనించిన సిబ్బంది వెంటనే స్పందించి విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తప్పించుకున్నారు. అయితే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా కాలిపోయి బూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ బస్సుల నిర్వహణ, ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలపై పాఠశాల యాజమాన్యం మరింత శ్రద్ధ పెట్టాలని కోరుతున్నారు. బస్సు సరైన కండిషన్‌లో లేకపోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గతంలోనూ ఇదే పాఠశాలకు చెందిన మరో బస్సు మంటల్లో దగ్ధమైన ఘటన జరిగిందని గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలోని అన్ని బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణపై అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మంటలు చెలరేగిన సమయంలో బస్సులో విద్యార్థులు ఉండి ఉంటే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదృష్టవశాత్తూ పిల్లలను వెంటనే బస్సు నుంచి దూరంగా తరలించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్కూల్ బస్సుల్లో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు అవసరమైన భద్రతా పరికరాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, అత్యవసర ద్వారాలు తదితర ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అనే అంశంపైనా ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనకు అసలు కారణం ఏమిటి? బస్సు ఫిట్‌నెస్ సక్రమంగా ఉందా? గతంలోనూ ఇలాంటి ఘటన జరిగిందన్న తల్లిదండ్రుల ఆరోపణల్లో వాస్తవం ఎంత? అనే అంశాలపై సంబంధిత అధికారులు, పాఠశాల యాజమాన్యం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణపై అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# పెరుగుతున్న సైబర్ మోసాలు



**నేటి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎదో ఒకచోట ఎదో ఒక రకంగా వినియోగదారులు, ప్రజలు సైబర్ దాడులకు గురై మోసపోతూనే ఉన్నారు. తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కావాలనే తప్పుడు కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో యూజర్లు వాళ్లు అడిగినంత ఇచ్చుకుంటున్నారు.**

ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్‌కి 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న , తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ. 4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుందని, ఆ ప్రాసెస్‌లో వెళ్తే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు. "ఈ పరిస్థితి బాధితులకు ఎంత ఇబ్బందిగా ఉంటుందో మాకు అర్థమవుతోంది, ఇలాంటివి జరగకుండా నిరోధించేలానే మా వ్యవస్థలను తీర్చిదిద్దాం" అని మెటా ప్రతినిధి వివరించారు. "మా విచారణ తర్వాత, సదరు కంటెంట్‌ను మళ్లీ యథాస్థితికి తెచ్చాం. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఖాతాలకు అదనపు భద్రతను కూడా కల్పించాం" అని తెలిపారు. కానీ, ఏది నిజమైన ఫిర్యాదో, ఏది నకిలీదో గుర్తించడంలో మెటా పనితీరు పేలవంగా ఉందని క్రియేటర్లు అంటున్నారు. నెలవారీ ఫీజు చెల్లించే క్రియేటర్ల అప్పీళ్లకు తప్ప, సాధారణ యూజర్ల ఫిర్యాదులకు సంస్థ త్వరగా స్పందించడం లేదని వారు బీబీసీతో చెప్పారు. 'లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ పాత చారిత్రక చిత్రాలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. దీనికి 15 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. దీనిని నడిపే ఓలి ( పూర్తి పేరు చెప్పడానికి ఇష్టపడలేదు), తాను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న చిత్రాలను లేదా హక్కుదారుల అనుమతి ఉన్నవాటినే పోస్ట్ చేస్తున్నట్లు బీబీసీకి చెప్పారు. అయినా సరే, ఈ ఏడాదిలో అతనికి ఇప్పటివరకు డజన్ల కొద్దీ "స్పష్టంగా నకిలీ" కాపీరైట్ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మెటా వాటి వాస్తవాన్ని చెక్ చేయదు. కాబట్టి ఎవరి ఖాతాపైనైనా ఇలా వరుసగా ఫిర్యాదులు వస్తే వాళ్ల అకౌంట్ తాత్కాలికంగా ఆగిపోతుంది.

ఒకే ఈమెయిల్ ఐడీ నుంచి ఒకేసారి తన పలు పోస్టులపై కాపీరైట్ స్ట్రైక్స్ వస్తున్నాయని ఓలి చెప్పారు. ఆ తర్వాత ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తి, టెలిగ్రామ్ లాంటి ప్రైవేట్ మెసేజింగ్ యాప్‌లోకి రమ్మని మెసేజ్ చేస్తాడు. "వాళ్లు కొంత డబ్బు డిమాండ్ చేస్తారు" అని ఓలి తెలిపారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటే సాధారణంగా కొన్ని వందల డాలర్లు అడుగుతారని చెప్పారు. డబ్బు అడగడం లేదా భవిష్యత్తులో మరిన్ని కాపీరైట్ ఫిర్యాదులు చేస్తామని బెదిరించడం లాంటి మెసేజ్‌లను బీబీసీ కూడా పరిశీలించింది. ఇన్‌స్టాగ్రామ్ తాత్కాలికంగా ఆపేసిన తన అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడానికి ఓలి చివరికి ఒక మోసగాడికి క్రిప్టోకరెన్సీ రూపంలో 50 డాలర్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా డబ్బులు ఇస్తే నేరగాళ్లను ప్రోత్సహించినట్లే అవుతుందని, కాబట్టి డబ్బులు ఇవ్వొద్దని పోలీసులు బాధితులకు సూచిస్తున్నారు. మెటాను సంప్రదించి ఖాతాను వెనక్కి తెచ్చుకోవాలంటే వారాల కొద్దీ సమయం పడుతుంది కాబట్టి, వేగంగా పనైపోతుందనే ఉద్దేశంతోనే తాను "చివరి ప్రయత్నంగా" డబ్బు కట్టానని ఓలి అన్నారు. కానీ డబ్బు ఇచ్చిన వెంటనే మళ్లీ అతనికి కాపీరైట్ స్ట్రైక్స్ పడ్డాయి. "అదే అత్యంత బాధాకరమైన విషయం" అన్నారు ఓలి. "మనల్ని అంతలా టార్చర్ చేసినవాళ్లకే డబ్బులు సమర్పించుకోవడం, ఆ వెంటనే మళ్లీ వాళ్లు అదే పని చేయడం మనకు ఎంతో నరకంగా అనిపిస్తుంది" అన్నారు. కాపీరైట్ దావాలు ఎక్కువగా రావడంతో ఓలి ఖాతాకు మానిటైజేషన్ ఆగిపోయింది. అంటే, అతని పోస్టులు ఎంత వైరల్ అయినా ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతనికి నయాపైసా రాదు. "ఇది వేధింపులా కాదా అని తెలుసుకోవడానికి లేదా అసలు ఏం జరుగుతుందో కనిపెట్టడానికి (మెటా నుంచి) వ్యవస్థలో కనీస విచారణ కూడా జరగడం లేదు" అని ఓలి అన్నారు.

చాలా మంది ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా ఇలాంటి అనుభవాలనే పంచుకున్నారు. "క్రియేటర్ల కోసమే తాము ఉన్నామని మెటా పైకి చెబుతున్నప్పటికీ, ఈ ప్రాసెస్‌లో వాళ్లు కనీస సాయం కూడా చేయలేదు. పైగా కస్టమర్ సపోర్ట్ కోసం డబ్బులు కట్టమంటారు" అని 'మోర్బిడ్ క్యూరియాసిటీ' పేజీని రన్ చేస్తున్న అభిన్ టామ్ సెబాస్టియన్ అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'బ్లూ టిక్' (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకు తుంది. "నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్ట్‌లు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరగవని చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు" అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్లు నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది. బాధితులు నేరుగా ఆ హక్కుదారులనే సంప్రదించాలని సూచిస్తోంది. ఎదైనమైనా ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఊరట

**రిమాండ్ పిటిషన్ తిరస్కరణ**

**ఉదయం తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి అరెస్ట్**

**నారాయణ గూడ పోలీస్ స్టేషన్‌కు తరలింపు**





**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో భారీ ఊరట లభించింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పాటు విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా వ్యవహరించారనే అభియోగాలపై పోలీసులు.. ఇవాళ ఉదయం తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే పోలీసులు కోరిన రిమాండ్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను మంగళవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారిని నాంపల్లి కోర్టు ముందు హాజరుపరిచి రిమాండ్ కోరారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఇద్దరికీ వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించడంతో పాటు రెండు ష్యూరిటీలు ఇవ్వాలని ఆదేశించింది. అవసరమైన పూచీకత్తు, ష్యూరిటీలు సమర్పించిన తర్వాత వారిద్దరినీ విడుదల చేయాలని పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశించింది. దీంతో న్యాయపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎమ్మెల్సీలు విడుదల అయ్యారు. విచారణ సందర్భంగా అసెంబ్లీ వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన దృశ్యాలను అసెంబ్లీ లీగల్ టీమ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వాటిని పరిశీలించిన అనంతరం న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలు విన్నది. ఎమ్మెల్సీల తరఫు న్యాయవాదులు ఈ కేసులు రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా నమోదు చేశారని వాదించినట్లు తెలుస్తోంది. రిమాండ్‌ను తిరస్కరించి తమ క్లయింట్లను విడుదల చేయాలని కోర్టును కోరారు. మరోవైపు పోలీసులు కేసు నమోదు చేసిన కారణాలను కోర్టుకు వివరించారు. ఇదిలా ఉండగా.. అసెంబ్లీ వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి తెలంగాణ హైకోర్టులోనూ పరిణామాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని, ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారని.. ప్రభుత్వ వ్యతిరేక రాతలతో కూడిన నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారని అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరించినట్లు తెలుస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే పోలీసులు వారిని అడ్డుకున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాదించింది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు నిబంధనలు ఉల్లంఘించారని.. నిషేధాజ్ఞలను పాటించలేదని ఏజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విధుల్లో ఉన్న పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లను నెట్టివేయడంతో పాటు దూషించారని ప్రభుత్వం ఆరోపించింది. ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉన్నప్పటికీ, స్పీకర్ ఆదేశాల మేరకే పోలీసులు వారిని అడ్డుకున్నారని ఏజీ వివరించినట్లు తెలుస్తోంది. అంతకు ముందు బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. సోమవారం హైదరాబాద్ లో అసెంబ్లీ ప్రాంగణంలో చేపట్టిన నిరసన ప్రదర్శనల సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ జీ ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో అరెస్ట్ అయ్యారు. కొద్దిసేపటి కిందటే పోలీసులు న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో వారిని అదుపులోకి తీసుకున్నారు. నారాయణ గూడ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అసెంబ్లీ స్పీకర్ ఓఎస్డీ పోలేపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిద్దరిపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. బీఎన్ఎస్ సెక్షన్ 352, 3(5), ఎస్సీ/ఎస్టీ చట్టంలోని సెక్షన్లు 3(1)(ఆర్), 3(2)(వీఏ), 3(2)(7) కింద కేసు నమోదు చేశారు. దీనికి అనుగుణంగా కొద్దిసేపటి కిందటే వారిని అదుపులోకి తీసుకున్నారు. తాతా మధు అరెస్ట్ సమాచారం తెలుసుకున్న వెంటనే పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్వార్టర్స్ కు చేరుకున్నారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తనను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ తాతా మధు పార్టీ నాయకులను ఉద్దేశించి చెప్పడం కనిపించింది. స్పీకర్ ను ఉద్దేశించి ఏకవచనంతో సంబోధించడం, కఠినపదజాలాన్ని ప్రయోగించడమే ఆయన అరెస్ట్ కు దారి తీసింది. ఆయన చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ ప్రసాద్ కుమార్ కన్నీరు సైతం పెట్టుకున్నారు. ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అమర్యాదకరంగా మాట్లాడటాన్ని తప్పుట్టారు. శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చెయ్యాలనీ మంత్రులు పట్టుబట్టారు.

# 11న మోదీ, పుతిన్ భేటీ

**ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్న ఇరువురు నేతలు**



**న్యూఢిల్లీ:** బ్రెజిల్, చైనా, ఈజిప్టు, ఇథియోపియా, ఇండియా, ఇండోనేసియా, ఇరాన్, రష్యా, దక్షిణాఫ్రికా దేశాలతో కూడిన 'బ్రిక్స్'శిఖరాగ్ర సదస్సుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ నెల 12, 13న ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే సమావేశానికి కూటమి దేశాల అధినేతలు హాజరుకాబోతున్నాయి. సదస్సు కంటే ఒక రోజు ముందు ఈ నెల 11న భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధినేత పుతిన్ ప్రత్యేకంగా భేటీ కాబోతున్నారు. ఈ విషయాన్ని రష్యా అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మంగళవారం నిర్ధారించారు. ఆయన భారత జర్నలిస్టులతో ఆన్‌లైన్‌లో సంభాషించారు. ఢిల్లీలో ప్రధాని మోదీతో అధ్యక్షుడు పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారని తెలిపారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై వారు దృష్టి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇరువురు నేతల మధ్య అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఉద్ఘాటించారు. అత్యంత సున్నితమైన అంశాలపై బహిరంగంగా, నిర్మాణాత్మకంగా చర్చించేలా మోదీ, పుతిన్ ఆచరణాత్మక దృక్పథం, చిత్తశుద్ధి కలిగి ఉన్నారని పెస్కోవ్ వివరించారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో సరిహద్దుల వద్ద నెలకొన్న పరిస్థితులను మోదీకి వివరించడానికి పుతిన్‌కు ఇది మరో అవకాశం కానుందని అభిప్రాయపడ్డారు. రష్యా మార్కెట్‌లో విస్తరణ చర్యలు చేపట్టడానికి, రష్యా ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టడానికి భారతీయ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని అన్నారు. ఆయా కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలియజేశారు. ఉక్రెయిన్--రష్యా ఘర్షణను ముగించడానికి భారత్ చేసే ఎలాంటి శాంతి ప్రయత్నాలనైనా తాము స్వాగతిస్తామని స్పష్టంచేశారు. చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కారం సాధించాలన్న భారత్ వైఖరికి రష్యా వ్యూహం చాలా దగ్గరగా ఉందని వ్యాఖ్యానించారు.

# గ్యాంగ్‌రేప్ కేసులో ఉరిశిక్ష

**పోక్సో కోర్టు సంచలన తీర్పు**

**తిరునల్వేలి, సెప్టెంబర్ 8 :** మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువ రించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికులానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్ కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

# యూట్యూబర్ 'నందు'కు నోటీసులు..

**శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అడ్డుకున్న అధికారులు**



**హైదరాబాద్,సెప్టెంబర్8 :** చీటింగ్ కేసుకు సంబంధించి యూట్యూబర్, 'నందూస్ వరల్డ్' యూట్యూబ్ చానల్ నిర్వాహకురాలు నందనకు సోమవారం నోటీసులు జారీ చేసినట్లు ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం 'బీబీసీ'తో చెప్పారు. యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసాలు రెన్యువల్ చేస్తామని పలువురిని మోసగించారంటూ నందన, ఆమె భర్త మధుకర్, ఆయన తండ్రి మోహన్ రావుపై గత ఏడాది నవంబర్‌లో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుకు సంబంధించి అప్పట్లో లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం లండన్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన నందనని ఎయిర్‌పోర్ట్ ఇమిగ్రేషన్ పోలీసులు అడ్డుకుని ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం పంపించారు. వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని ఆమెకు 35 బీఎన్ఎస్ నోటీసులు అందించినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రెండు రోజుల్లో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆమెపై నమోదైన కేసులకు సంబంధించి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. నోటీసులు తీసుకుని ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ఆయన బీబీసీతో చెప్పారు. యూకేలో నివాసముంటూ యూట్యూబ్‌లో వీడియోలు చేసే గుంటూరుకి చెందిన రమానందన అలియాస్ నందు కుటుంబసభ్యులపై విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి గతేడాది నవంబర్‌లోనే కేసులు నమోదైప్పటికీ అనంతరం కూడా నందు కుటుంబసభ్యులపై పలు చోట్ల నుంచి మోసపూరిత ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తమ పీఎస్‌లో నమోదైన కేసు వివరాలను, వాటి పురోగతిని ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు 2026 జూన్ నెలలో బీబీసీకి తెలిపారు. విలక్షణమైన వాయిస్‌తో యూట్యూబర్‌గా సోషల్ మీడియాలో పాపులర్ అయిన నందు 'మన శంకర వరప్రసాద్' అనే సినిమాలోనూ నటించారు.



# ఇరాన్‌పై అమెరికా గెలిస్తే.. చమురు ధరలు దిగొస్తాయి: ట్రంప్

**వాషింగ్టన్ :** ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో అమెరికా విజయం సాధిస్తే.. చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అమెరికాలో పెట్రోల్ ధరలు ఒక గ్యాలన్‌కు 2 డాలర్ల దిగువకు పడిపోవచ్చని చెప్పారు. ఈ మేరకు ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న ఇంధన సంక్షోభానికి పశ్చిమాసియా ఘర్షణలు ప్రధాన కారణం. హార్మూజ్ జలసంధిలో ఇరాన్, అమెరికాలు.. నౌకల రాకపోకలను నియంత్రిస్తుండటంతో యుద్ధం ముందునాటితో పోలిస్తే ఇంధన ధరలు భారీగా పెరిగాయి. అమెరికా గెలిస్తేనే ఈ ఇంధన మార్కెట్లలో స్థిరత్వం వస్తుందని తాజాగా ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయడానికి తాము ఎప్పటికీ అనుమతించబోమని పునరుద్ఘాటించారు. తమపై దాడులు జరిగితే అదే స్థాయిలో ప్రతిదాడులు ఉంటాయని ఇరాన్ నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. కెనడా విమాన తయారీ సంస్థ బాంబర్డియర్ తన విమానాలు అమెరికాలో విక్రయించడానికి వీల్లేదని ట్రంప్ హెచ్చరించారు. ఆ సంస్థ తయారీ కార్యకలాపాలు అమెరికాకు తరలించాలని.. లేకపోతే విమానాలు అమ్మకుండా నిషేధిస్తామని చెప్పారు. అమెరికా – కెనడా మధ్య ఇటీవల జరిగిన వాణిజ్య చర్చలు చివరి నిమిషంలో విఫలమైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కెనడాపై ట్రంప్ విరుచుకుపడుతున్నారు.



# యూకే ఏటీసీలో సమస్య.. 300 విమానాలు రద్దు

**యూకే :** యూకేలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతిక సమస్య తలెత్తింది. లండన్‌లోని హీత్రూ, స్టాన్‌స్టెడ్ విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించే అనేక సర్వీసులు రద్దయ్యాయి. దీంతో పాటు మాంచెస్టర్, బర్మింగ్‌హామ్ తదితర నగరాల్లోని ఎయిర్‌పోర్ట్‌లపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్‌రాడార్24 పేర్కొన్న వివరాల ప్రకారం.. ఇప్పటివరకు దాదాపు 300 విమానాలు రద్దయినట్లు సమాచారం. సమస్యను పరిష్కరించేందుకు ఇంజినీర్లు ప్రయత్నిస్తున్నారని, సేవల పునరుద్ధరణకు కొంత సమయం పడుతుందని బ్రిటన్ 'నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్' తెలిపింది. ఈ ప్రభావం బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఈజీజెట్, కెఎల్ఎం, లుఫ్తాన్సా సహా అనేక విమానయాన సంస్థల సర్వీసులపై పడినట్లు ఫ్లైట్‌రాడార్ పేర్కొంది. సంబంధిత ఎయిర్‌లైన్స్ అప్‌డేట్‌లకు అనుగుణంగా ప్రయాణికులు నడుచుకోవాలని సూచించింది. యూరప్‌లోని అనేక ప్రాంతాలకు వెళ్లే అనేక విమాన సర్వీసులు రద్దయ్యాయని హీత్రూ ఎయిర్‌పోర్టు ప్రకటించింది. అయితే, ఆ ఎయిర్‌పోర్టులో దిగే విమానాలపై ఎటువంటి ప్రభావం లేదని తెలిపింది.

# బాబోయ్.. మతిమరుపు

- చిన్నపాటి విషయాలు గుర్తులేకపోవడమే కారణం
- 45 ఏళ్లు దాటిన వారిలో ఈ వ్యాధి లక్షణాలు అధికం
- రోగం ముదరకముందే మేల్కొంటే ఉత్తమం
- ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే సకాలంలో నయం





**ఒకప్పుడు మతిమరుపు అంటే వయస్సు మీద పడిన వారికి మాత్రమే వచ్చేది. ఇప్పుడు మధ్య వయస్సుల నుంచి యువత వరకూ దీని బారినపడుతున్నారు. వయస్సు మీద పడుతున్నకొద్దీ ఎంతోకొంత మతిమరుపు సహజమే. అయినా తేలికగా కొట్టేయడానికి లేదు. మామూలు మతిమరుపులో ఏదైనా క్లూ ఇస్తే ఆయా విషయాలు గుర్తుకొస్తాయి. అల్జీమర్స్ లో అలాకాదు. పైగా మొత్తం జరిగిన సంఘటనలనూ మరిచిపోతుంటారు. జ్ఞాపకాలను తుడిచేయడంతో పాటు మానసికంగానూ కుంగదీస్తుంది. ప్రవర్తననూ గణనీయంగా మార్చేస్తుంది. అసలు ఈ అల్జీమర్స్ లక్షణాలు ఏంటి ? ఈ వ్యాధి ఉన్న వారు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై డాక్టర్ బి.శ్రీధర్, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ మాటల్లోనే....**

మనిషి అంటేనే జ్ఞాపకాల సమాహారం. జ్ఞాపకాల తోడు లేకపోతే జీవితమే మూడునాళ్ళవుతుంది. మన ప్రతి కదలిక, ప్రతి మాట, ప్రతి పని వీటితో ముడిపడిందే. అంతటి కీలకమైన జ్ఞాపకాలను అల్జీమర్స్ మూలంగా తుడిచిపెడుతుంది. అల్జీమర్స్, వృద్ధాప్యంలో దాడిచేసే ఇది కన్నవారిని, కట్టుకున్నవారిని గుర్తుపట్టలేని స్థితికి తీసుకొస్తుంది. తీవ్రమైన మతిమరుపును తెలియజెసే డీమెన్షియా రకాల్లో అల్జీమర్స్ ఒకటి. డీమెన్షియా బాధితుల్లో దాదాపు 60-70 మందిలో కనిపించేది ఇదే. ప్రపంచ వ్యాప్తంగా 50కోట్ల మంది డీమెన్షియాతో బాధపడుతుండగా, వీరిలో 7 నుంచి 8శాతం మంది మనదేశానికి చెందినవారు. వీరి సంఖ్య 2030 నాటికి మరింతగా చేరకోవచ్చని అంచనా. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో నిజంగా ఇది కలవరం కలిగించే విషయమే. ఎందుకంటే 65 ఏళ్లు పైబడినవారిలోనే అల్జీమర్స్ ఎక్కువ. ఇది శారీరకంగా కన్నా మానసికంగా, ప్రవర్తన పరంగానే ఎక్కువ ఇబ్బందులు సృష్టిస్తుంది. ఇది జబ్బుతో బాధపడేవారికే కాదు, కుటుంబానికి కనిపెట్టుకునే వారికి చిక్కులు తెచ్చిపెడతాయి. అందువల్ల వీటి గురించి తెలుసుకోవడమే మంచిది. లేకుంటే ఈ వ్యాధితో బాధపడేవారిని అపార్థం చేసుకోవడానికి దారితీస్తుంది.

## రోజువారీ పనులే మరిచిపోతారు :

వ్యాధిగ్రస్తులు రోజువారీ కార్యకలాపాలు మరిచిపోతారు. స్నానం చేయడం, బ్రష్ చేయడం, తిండి తినడం కూడి మర్చిపోతారు. వస్తువులను ఎక్కడో పెట్టి ఆ విషయాన్ని మర్చిపోయి ఎవరో దొంగిలించినట్లుగా అనుమానించడం, చెప్పిన విష్యాన్నే పదేపదే చెప్పటం, మనుషుల పేర్లు మర్చిపోవడం, వాటిని ఏ విధంగా వినియోగించాలో, ఎందు నిమిత్తం వినియోగించాలి అనే విషయాలను మర్చిపోవడం రోగిలో ప్రధానంగా కనిపిస్తాయి. ఇంటికి తాళాలు వేయడం, కూరలో ఉప్పువేయడం, పాల్లో తోడు వేయడం వంటివి మర్చిపోవడం వ్యాధి గ్రస్తుల్లో అధికంగా కనిపిస్తాయి.

## వ్యాధి లక్షణాలు ఇవే :

వయస్సు పెరిగే కొద్దీ వచ్చే అల్జీమర్స్ వ్యాధి సోకిన వారు ఒకే చోట కూర్చుని వీడియో గేమ్స్, టీవీలు చూస్తుండడం, నిద్ర లేకపోవడం, అతిగా మద్యం తాగడం, శారీరక, మానసిక వ్యాయామం లేకపోవడం, అధిక కొవ్వు ఉన్న మాంసం తినడం వారికి ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. బంధువులు, కుటుంబ సభ్యుల పేర్లు మర్చిపోతారు. పేర్లు మర్చిపోవడంతో పాటు వారిని గుర్తించడం కూడా కష్టమే. ఈ వ్యాధి ఎక్కువగా 50 ఏళ్లు దాటిన వారిలో వస్తుంది, నేడు 35 ఏళ్లు వారిలో కూడా వ్యాధి లక్షణాలు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది.

## నివారణ చర్యలు ఇవే :

మతిమరుపును నివారించేందుకు ప్రశాంతమైన మెడిటేషన్, ప్రాణాయామం, పుస్తక పఠనం, రాయడం, బొమ్మలు గీయటం, ఇతర భాషలు నేర్చుకోవడం చేస్తుండాలి. కూరగాయలు, తాజా ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తినాలి. బి12, డి విటమిన్, బి6 వంటి విటమిన్లలోపం తలెత్తకుండా చూసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయ టం చాలా ముఖ్యం. నలుగురితో కలిసిడిగా ఉండటం, వీలైనప్పుడల్లా బంధువులను, స్నేహితులను కలవటం మంచిది. స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం చేయాలి. రోజువారీ వ్యాయామం చేయాలి, కంటి నిండా నిద్రపోవాలి. బ్రెయిన్ ట్యూమర్లు, స్ట్రోక్ కారణంగా అల్జీమర్స్ వస్తుంది. ఈ రోగాలు రాకుండా జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి.




### ప్రజల్లో అవగాహన పెరగాలి

**- డాక్టర్ బి.శ్రీధర్, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్**



మతిమరుపు వ్యాధి నివారణపై ప్రజల్లో గ్రామస్థాయి నుంచి అవగాహన పెరగాలి. ప్రతి మనిషిలో చిన్నపాటి మతిమరుపు ఉండటం సహజం. కానీ అది ముదరకముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ, యువతతో పాటు, 60 ఏళ్లు దాటిన వారు నిత్యం వాకింగ్, వ్యాయామం చేయడంతో పాటు, తాజా ఆకుకూరలు తినాలి. కంటినిండా నిద్రపోవాలి. స్నేహితులు, కుటుంబసభ్యులతో మాట్లాడుతుండాలి. ఇతర భాషలను నేర్చుకోవడంతో పాటు ప్రతి రోజు 100 నుంచి 1 వరకు రివర్స్ చదువుకోవాలి.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన కోమటిరెడ్డి జీవన్ రెడ్డి

**దుబ్బాక సెప్టెంబర్ 8(జనం వార్త) :** సిద్దిపేట జిల్లాదుబ్బాక మండలం రాజక్కపేట గ్రామానికి చెందిన కోప్పు నర్సవ్వ గుండె పోటుతో మరణిచిన విషయాం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించిన రాజక్కపేట గ్రామానికి చెందిన (సిద్దిపేట జిల్లా ఆయిల్ ఫామ్ రైతు అధ్యక్షులు) కోమటిరెడ్డి జీవన్ రెడ్డి , వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని వారి కుటుంబానికి తన వంతు సహాయంగా 5000 రూపాయలు అందజేయడం జరిగింది.



## నేతన్న టీవీ బిగ్గెస్ట్ అవార్డు అందుకున్న రఘునాధపురం మాజీ సర్పంచ్ గాడి పెల్లి శ్రవణ్ కుమార్

**రాజపేట సెప్టెంబర్ 8 (జనం వార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గాడి పెల్లి శ్రవణ్ కుమార్ కి, స్వరాజ్ న్యూస్ మరియు నేతన్న టీవీ సంయుక్తంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రంగాల్లో గల పద్మశాలి ప్రతిభావంతులను గుర్తించి వారికి చేనేత ఆణిముత్యం పేరిట అవార్డులను ప్రకటించి ప్రధానం చేశారు. ఇందులో భాగంగా రఘునాధపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్,జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు, గాడి పెల్లి శ్రవణ్ కుమార్ కు చేనేత ఆణిముత్యం అవార్డు అందజేశారు,తను 1999 సంవత్సరం నుండి ఐదు సంవత్సరాలు, గ్రామ సర్పంచ్ గా కొనసాగారు, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తూ అనేక స్వచ్ఛంద కార్యక్రమలు నిర్వహించినందుకు గాను నేతన్న బిగ్గెస్ట్ 2026 అవార్డు ప్రకటించి హనుమకొండ వరంగల్ ఎస్వీఎస్ విద్యాసంస్థల ఆడిటోరియంలో జరిగిన అవార్డు ప్రస్తుత కూడా చైర్మన్ మాజీ ఎంపీ మాజీ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ గుండు సుధారాణి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కామత్తపు మురళి,మరియు ఎస్వీఎస్ విద్యాసంస్థల అధినేత తిరుమలరావు, తెలంగాణ ప్రాంత మహిళా అధ్యక్షురాలు గుంటుక రూప సదానందం,తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్,మరియు తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకన్న నారాయణ చేతుల చేతుల మీదుగా అవార్డు మెమొంటో ఇచ్చి,చేనేత శాలువాతో ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి నాయకులు మరియు మాది ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు మాజీ జడ్పీ చైర్మన్ సాంబా రపు సమ్మయ్య మరియు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన పద్మశాలి ప్రముఖులు సంఘల రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## తాతా మధును తక్షణమే సస్పెండ్ చేయాలి!

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన
- తాతా మధు దిష్టిబొమ్మ దహనం..
- క్షమాపణ చెప్పాలని కేసీఆర్‌కు డిమాండ్

**జడ్చర్ల, సెప్టెంబర్ 8:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రాజాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్--బెంగళూరు జాతీయ రహదారిపై తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు.
ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానపరిచేలా ఉన్నాయని అన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఈ వ్యవహారంపై వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు.

### "ఇది తెలంగాణకు చీకటి రోజు"

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే అవమానమని శేఖర్ గౌడ్ పేర్కొన్నారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా శాసనసభలోని ప్రతి సభ్యుడు ఈ వ్యాఖ్యలను ఖండించాలని కోరారు. మహబూబ్‌నగర్ డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పోలేపల్లి యాదయ్య మాట్లాడుతూ.. సభాపతి పట్ల తాతా మధు చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు

బీఆర్ఎస్ పార్టీపై యాదయ్య తీవ్ర విమర్శలు చేశారు. దళితుల పట్ల వివక్ష చూపే విధంగా ఆ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తుల పట్ల గౌరవంతో వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, రమేష్, శివ, కోస్గి మల్లేష్, ప్రశాంత్, రమణ, రాజేష్, శ్యాంసుందర్, శంకరయ్య, చందర్‌నాయక్, సాయి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## యూటర్న్ సమస్యపై అఖిలపక్ష తీర్మానం

### పాదచారులకు రోడ్డు దాటేందుకు జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయాలి



**నాగారం, సెప్టెంబర్ 8 (జనం వార్త) :** నాగారం డివిజన్ లో యూటర్న్, పాదచారులకు రోడ్డు దాటేందుకు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం సత్యనారాయణ కాలనీ కమిటీ హాల్‌లో అఖిలపక్ష నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నాగారం ప్రధాన రహదారిపై నెలకొన్న యూటర్న్ సమస్య, పాదచారులు రోడ్డు దాటేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు,ట్రాఫిక్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల భద్రత,సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అఖిల పక్ష నాయకులందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు.అవసరమైన ప్రాంతాల్లో యూటర్న్‌లు, పాదచారులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

### యూటర్న్ కోసం ప్రతిపాదించిన ప్రాంతాలు

కళ్ల కాంపౌండ్ సమీపంలో,రాఘవేంద్ర హోటల్ సమీపంలో లేదా మార్బుల్ షాప్ వద్ద అనువైన ప్రదేశాన్ని అధికారులు సాంకేతికంగా పరిశీలించి యూటర్న్ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు.

### పాదచారుల కోసం జీబ్రా లైన్స్.

ఎస్.వి.నగర్‌లోని ఎస్.బి.ఐ బ్యాంక్ సమీపంలో,ప్రభుత్వ పాఠశాల సమీపంలో విద్యార్థులు,తల్లిదండ్రులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు ప్రత్యేక క్రాసింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలి.

### దమ్మాయిగూడ వెళ్లే మార్గంలో

ప్రజలు సురక్షితంగా రోడ్డు దాటేందుకు జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రోటోకాల్,నిబంధనల ప్రకారం డీసీపీ, సీపీ అధికారులకు అఖిలపక్ష నాయకుల తరఫున వినతిపత్రాలు అందజేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు.



## గణేష్ ఉత్సవాల్లో డీజేలపై పూర్తి నిషేధం

### రాత్రి 10 దాటితే మైకులు బంద్ : ఎస్ఐ వి. మహేష్

**చివ్వెంల, సెప్టెంబర్ 08 :** రానున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్రలు, నిమజ్జన వేడుకలను శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని చివ్వెంల ఎస్ఐ వి. మహేష్ సూచించారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, శబ్ద కాలుష్య నియంత్రణ దృష్ట్యా డీజేల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని డీజే సిస్టమ్స్ నిర్వాహకులతో ప్రత్యేక కౌన్సెలింగ్ సమావేశం నిర్వహించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.
పోలీస్ శాఖ ముఖ్య ఆదేశాలు :

- డీజేలపై సంపూర్ణ నిషేధం : గణేష్ మండపాల వద్ద గానీ, ఊరేగింపులు, శోభాయాత్రలు, నిమజ్జన వేడుకల్లో గానీ ఎలాంటి డీజేలను ఏర్పాటు చేయకూడదు. ఉత్సవ కమిటీలకు డీజేలను అద్దెకు ఇవ్వరాదని నిర్వాహకులను ఆదేశించారు.
- రాత్రి 10 గంటల వరకే మైకులకు అనుమతి : సుప్రీంకోర్టు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత మైక్ సెట్లు, సౌండ్ బాక్సులను పూర్తిగా నిలిపివేయాలి. పరిమితికి మించిన శబ్దాలతో ప్రజలకు, రోగులకు, విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవు.
- బైండోవర్ : నిబంధనలను పకడ్బందీగా అమలు చేసేందుకు స్టేషన్ పరిధిలోని డీజే నిర్వాహకులందరినీ చట్ట ప్రకారం బైండోవర్ చేయడం జరిగింది.
- కఠిన చర్యలు : ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి డీజేలు నడిపినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేసి పరికరాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.
- ఉత్సవ కమిటీలు, యువకులు, భక్తులు పోలీసు శాఖకు సహకరించి, పండుగ పవిత్రతను కాపాడుతూ వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ పిలుపునిచ్చారు.



# కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే

- సామాన్యులకు ఊరట కల్పించేలా చర్యలు
- వచ్చే వారం నుంచి రైతు బజార్లలో లభ్యం
- ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

**అమరావతి,సెప్టెంబర్ 8 :** ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు. వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు అపాయింట్‌మెంట్ కోరిన దస్తగిరి



**అమరావతి, సెప్టెంబర్ 8 :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు మంగళవారం అమరావతికి చేరుకున్నాడు. గత ప్రభుత్వంలో తనను వేధించిన అధికారులే ఇప్పటికీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎంకు ఒక వినతిపత్రం సమర్పించేందుకు అమరావతి వచ్చినట్టు వెల్లడించాడు. తన భార్య షేక్ షబానాతో కలిసి వచ్చిన దస్తగిరి, సీఎం అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నట్లు మీడియాకు తెలిపాడు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాడు. ఇప్పుడు జగన్ కు తాను నైతిక విలువలు చెప్పాల్సి వస్తోందని, జగన్ ఆ స్థాయికి దిగజారారని ఎద్దేవా చేశాడు. రాష్ట్రం గురించి మాట్లాడే ముందు, బాబాయి కూతురికి న్యాయం చేయాలని హితవు పలికాడు. తాను న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా నుంచి వకాల్తా తీసుకున్నట్లు నిరూపిస్తే జైలుకు వెళ్లడానికి సిద్ధమని, ఒకవేళ నిరూపించలేకపోతే జగన్ రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని సవాల్ విసిరాడు. వివేకా హత్య కేసులో జగన్, ఆయన భార్య భారతి విచారణ సంస్థలకు పూర్తిగా సహకరించాలని దస్తగిరి డిమాండ్ చేశాడు. అంతేకాకుండా, వివేకా హత్య కేసు, సంబంధిత మనీలాండరింగ్ వ్యవహారాలపై తన వద్ద ఉన్న కీలక వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తానని దస్తగిరి స్పష్టం చేశాడు. "గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నన్ను చంపేస్తామని బెదిరించిన అధికారులే ఇప్పటికీ నా వెంటపడుతున్నారు. వారి వేధింపులు భరించలేకపోతున్నాం. అందుకే మా గోడును సీఎంతో చెప్పుకోవడానికి వచ్చాం" అని దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశాడు. దస్తగిరి భార్య షబానా మాట్లాడుతూ, తాము పులివెందులకు వెళ్లాలంటేనే భయంగా ఉందని కన్నీటిపర్యంతమైంది. తమ కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, న్యాయం పొందాలనే ఆశతో అమరావతికి వచ్చామని ఆమె తెలిపింది. సీఎంను కలిసేందుకు అనుమతి ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేసింది.

# డీఎస్సీలో అక్రమాలు జరిగాయి

## వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్

**అమరావతి,సెప్టెంబర్8 :** ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని, దీనికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. విజిలెన్స్ విచారణ జరుగుతోందని అధికారులు చెప్పారని... దీని అర్థం డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చెప్పడమే అని అన్నారు. విజిలెన్స్ పేరుతో కాలయాపన చేయకుండా ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటకు తీసేందుకు సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటా కింద కేటాయించిన 382 ఉద్యోగాలను ఎవరికి ఇచ్చారో పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని మార్గాని భరత్ నిలదీశారు. జూడో అసోసియేషన్ ఛైర్మన్‌గా ఉన్న లోకేశ్ తోడల్లుడు శ్రీభరత్ పైనా ఆరోపణలు చేస్తూ... పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ అక్రమాలు జరిగాయని విమర్శించారు.

# డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నది

## పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్

**అమరావతి,సెప్టెంబర్8 :** టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తమ ఓటు బ్యాంకుకు నష్టం జరుగుతుందనే భయం వైసీపీని వెంటాడుతోందని బోడే ప్రసాద్ అన్నారు. అందుకే ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ భుజానికెత్తుకున్నారని విమర్శించారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై కూడా అక్రమాలు జరిగాయంటూ ఒక పత్రికను అడ్డుపెట్టుకుని విష ప్రచారం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలోని ఇద్దరు అక్కాచెల్లెళ్ల ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్న ఆ యువతులు కష్టపడి చదివి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని, వారిలో ఒకరు 2019లో కేవలం ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయారని తెలిపారు.

# ఎల్‌నినో.. తాగునీటికే మొదటి ప్రాధాన్యం

## ఇప్పటికే 54శాతం లోటు వర్షపాతం : సీఎం చంద్రబాబు

## గొడ్డలి పార్టీ నేతల దుష్ప్రచారాన్ని ఉపేక్షించవద్దు



**అమరావతి, సెప్టెంబర్ 8 :** ఎల్‌నినో వల్ల ఏపీపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 54శాతం లోటు వర్షపాతం నమోదైందని, జలాశయాల్లో గతేడాది 737 టీఎంసీల నీరు ఉంటే.. ఈసారి 530 టీఎంసీలే ఉందని తెలిపారు. ఎల్‌నినోపై జరిగిన చర్చలో నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గుతున్నాయని అన్నారు. "నెల్లూరు, తిరుపతి, కోనసీమ జిల్లాల్లో వేయాల్సిన దానికన్నా ఎక్కువగా పంటలు వేశారు. మార్కాపురం, పోలవరం, ప్రకాశం జిల్లాల్లో 12శాతం పంటలే వేశారు. ఉద్యాన పంటలు కూడా పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. సంక్షోభం దృష్ట్యా తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తాం. బోర్లు ఎండిపోయిన చోట తాగునీటి కొరత లేకుండా చూడాలి. ప్రతి ఎకరాన్నీ పీఎండీఎస్ విధానంలో సాగు చేసేలా చూడాలి. 32 రకాల విత్తనాలను పీఎండీఎస్ ద్వారా సాగు చేసేందుకు అవకాశం ఉంది. సాగునీటి ప్రాజెక్టులకు మా ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేసింది. ఉచిత ఇసుక.. ఇతర రాష్ట్రాలకు వెళ్తే అడ్డుకోవాలి. ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకొని ఉచిత ఇసుక ఇస్తున్నాం. వైకాపా పాలనలో జే బ్రాండ్ల వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యాన్ని ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించేందుకు వీల్లేదు. గొడ్డలి పార్టీ నేతల దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దు. టీచర్లను బెదిరించే స్థాయికి గొడ్డలి పార్టీ మీడియా దారుణాలకు ఒడిగట్టింది. ఇలా బరితెగించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించ కూడదు" అని చంద్రబాబు అన్నారు.

## అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలి: సీఎం చంద్రబాబు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి సమన్వయం వరకు ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. అమరావతిలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో స్థానిక ఎన్నికల సన్నాహాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. గెలుపే లక్ష్యంగా పనిచేస్తూనే కూటమిలో బ్యాలెన్సింగ్ పాటించాలని సూచించారు. సీట్లు, రిజర్వేషన్లపై కొందరు కోర్టులకు వెళ్లినా.. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్లు, ఛైర్మన్లను ఎన్నుకునేలా నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా.. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆదేశించారు. కమిటీల ద్వారా అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాగద్వేషాలకు అతీతంగా క్షేత్రస్థాయిలో నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. వైకాపా దుష్ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని చంద్రబాబు స్పష్టం చేశారు. వైకాపా ఫేక్ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టి ఓటు బ్యాంక్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఓటు వేయని వారినీ చేసిన అభివృద్ధితో ఆకట్టుకుని పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.

# ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్‌చిన్

## అక్సాయ్‌చిన్‌కు పశ్చిమాన భారత్, తూర్పున చైనా

## ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్‌లో ప్రత్యక్షం..!?



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 :** ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం మరోసారి చర్చనీయాంశంగా మారింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో వెలువడిన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను భారత్, చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపించారు. అక్సాయ్‌చిన్‌ను లడఖ్‌లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానంపై చర్చలు జరుగుతున్న సమయంలో జులై 1న ఈ మ్యాప్‌ను తొలిసారి విడుదల చేశారు. ఇందులో అరుణాచల్‌ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించారు. అరుణాచల్‌ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చూపిస్తూ.. పశ్చిమాన అసోం, ఉత్తరాన చైనా సరిహద్దుగా ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. అదే విధంగా అక్సాయ్‌చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులు ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. ఈ మార్పులు ఎందుకు చేశారన్న దానిపై ఐరాస ఎలాంటి వివరణ ఇవ్వలేదు. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)ని కూడా మ్యాప్‌లో చుక్కల రేఖతో చూపించారు. దీనిపై మ్యాప్ కింది భాగంలో ఐరాస వివరణ ఇచ్చింది. భారత్, పాకిస్థాన్ అంగీకరించిన జమ్మూ కశ్మీర్ ఎల్‌ఓసీని ఈ చుక్కల రేఖ సుమారుగా సూచిస్తుందని పేర్కొంది. జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం కుదరలేదని తెలిపింది. ప్రపంచంలోని ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానత్వంతో చూపించాలంటూ ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో తీసుకొచ్చిన 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం గత వారం ఆమోదించింది. ముఖ్యంగా ఆఫ్రికా ప్రాంతాల భౌగోళిక చిత్రణను మరింత సమానంగా చూపించడమే దీని లక్ష్యం. ఈ తీర్మానం చట్టబద్ధంగా అమలు చేయాల్సినది కాదు. అయితే ప్రపంచవ్యాప్తంగా బహుళపక్ష సంస్థలు ఉపయోగించే ప్రామాణిక ప్రపంచ పటాల్లో దీనికి అనుగుణంగా మార్పులు చేసే అవకాశం ఉంది. ఆఫ్రికన్ గ్రూప్ తరఫున టోగో ఈ తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లింది. భారత్ దీనికి మద్దతు తెలిపింది. సమాన విస్తీర్ణాన్ని ప్రతిబింబించే పటాల రూపకల్పన అనే మౌలిక సూత్రానికి మద్దతుగా తాము ఓటు వేసినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఏదైనా నిర్దిష్ట పటం, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణకు ఈ తీర్మానం ఆమోదం కాదని స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు సహా భారత సార్వభౌమ భూభాగాన్ని అధికారిక భారత పటం ప్రకారమే చూపించాలని పేర్కొంది. తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణను అంగీకరించబోమని తెలిపింది.

# భక్తుడు మర్చిపోయిన వస్తువులు అప్పగింత

## నిజాయితీ చాటుకున్న టీటీడీ సిబ్బంది

**అమరావతి,సెప్టెంబర్8 :** తిరుమల కొండపై విధులు నిర్వర్తించే టీటీడీ సిబ్బంది మరోసారి తమ నిజాయతీని, అప్రమత్తతను చాటుకున్నారు. ఓ భక్తుడు పొరపాటున మర్చిపోయిన సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగును విజిలెన్స్ సిబ్బంది సురక్షితంగా అతనికి అప్పగించారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం తిరుమల మార్గంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడుకు చెందిన పి. కార్తికేయన్ అనే భక్తుడు తన కుటుంబంతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో అలిపిరి తనిఖీ కేంద్రం (చెక్‌పాయింట్) వద్ద తనిఖీల అనంతరం, ఆయన తన బ్యాగును అక్కడే మర్చిపోయి తిరుమలకు వెళ్లిపోయారు. విధి నిర్వహణలో ఉన్న విజిలెన్స్ సిబ్బంది అక్కడ పడి ఉన్న బ్యాగును గుర్తించారు. దాన్ని పరిశీలించగా, అందులో విలువైన బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదు ఉన్నట్లు గమనించారు. వెంటనే బ్యాగులో లభించిన వివరాల ఆధారంగా భక్తుడు కార్తికేయన్‌ను ఫోన్‌లో సంప్రదించారు. బ్యాగు తమ వద్ద సురక్షితంగా ఉందని, తిరిగి వచ్చి తీసుకువెళ్లాలని సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కార్తికేయన్ వెంటనే తనిఖీ కేంద్రానికి చేరుకున్నారు. అధికారులు బ్యాగులోని వస్తువుల గురించి అడగగా, ఆయన అన్నింటినీ సరిగ్గా వివరించారు. ఆయన చెప్పిన వివరాలు సరిపోలడంతో, సిబ్బంది బ్యాగును అతనికి అందజేశారు. బ్యాగులో రూ.10,900 నగదు, రెండు గాజులు, ఒక బంగారు గొలుసు, రెండు బంగారు ఉంగరాలు ఉన్నాయని టీటీడీ సెక్టార్-5 ఏవీఎస్వో రమేశ్ తెలిపారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. తన విలువైన వస్తువులు తిరిగి దొరకడంతో భక్తుడు కార్తికేయన్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇంతటి అప్రమత్తత, నిజాయతీతో వ్యవహరించి తన బ్యాగును భద్రంగా అప్పగించిన టీటీడీ విజిలెన్స్ అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- సోషల్ మీడియాను యాక్టివ్‌గా వాడాలి
- టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం

**అమరావతి, సెప్టెంబర్ 8 :** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై యూకే కఠిన చర్యలు

## ఇజ్రాయెల్‌కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 :** అంతర్జాతీయ వేదికపై ఇజ్రాయెల్‌కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లతో వాణిజ్య సంబంధాలపై బ్రిటన్ (యూకే) ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ సెటిల్‌మెంట్ల నుంచి వచ్చే అన్ని రకాల వస్తువుల దిగుమతితో పాటు ఫైనాన్సింగ్, నిర్మాణ రంగం వంటి సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. బ్రిటన్ తీసుకున్న ఈ కీలక నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడా సైతం మద్దతు ప్రకటించడమే కాకుండా, తాము కూడా ఈ నిషేధంలో భాగస్వామ్యం పంచుకోనున్నట్లు వెల్లడించాయి. వెస్ట్ బ్యాంక్‌లోని పలు ప్రాంతాల్లో 'సెటిలర్ టెర్రరిస్టులు' పాలస్తీనియన్లపై జాతి నిర్మూలనకు పాల్పడుతున్నారని బ్రిటన్ విదేశాంగ మంత్రి ఎడ్ మిలిబాండ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలస్తీనా ప్రజల ఇళ్లను కూల్చివేయడం, రహదారులు, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ సమాజం కళ్లముందే పాలస్తీనాలో జరుగుతున్న ఈ పరిణామాల పట్ల తాను సిగ్గుపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రధాని ఆండీ బర్న్‌హమ్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్ విషయంలో యూకే తన విదేశాంగ విధానంలో తీసుకొచ్చిన అతిపెద్ద మార్పుగా దీనిని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఏడాది బ్రిటన్ ప్రభుత్వం పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా గుర్తించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. బ్రిటన్ నిర్ణయంపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు తీవ్రంగా స్పందించాయి. ఇది 'తీవ్రమైన తప్పుడు అంచనా' అని, తమ ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ మండిపడ్డారు. "బ్రిటన్ మాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే, మేము కూడా బ్రిటన్‌కు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌లోని అమెరికా రాయబారి మైక్ హకబీ ఈ చర్యను 'యూదు ప్రజలపై చూపిస్తున్న వివక్ష'గా అభివర్ణించారు. దీనికి ప్రతిగా అమెరికా నుంచి ప్రతీకార చర్యలు ఉండవచ్చని ఆయన సంకేతాలిచ్చారు. ఈ ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో, బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సోమవారం ఫోన్లో మాట్లాడినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది.

# వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు

**అమరావతి,సెప్టెంబర్8 :** వైసీపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్‌కు పంపించారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. మజ్జి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి కూడా వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బొత్స సత్యనారాయణ కుటుంబానికి ఉత్తరాంధ్రలో గట్టి పట్టుంది. అలాంటి కీలక నేత మేనల్లుడే పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జిల్లాలో కీలకమైన జడ్పీ ఛైర్మన్ పదవిలో ఉంటూ, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నేత రాజీనామా చేయడం వెనుక కారణాలపై పార్టీ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, తన రాజీనామాకు గల కారణాలను చిన్న శ్రీను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు అదానీ, ఎన్టీపీసీ నుంచి దరఖాస్తులు



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ లభించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక ప్రాజెక్టుకు అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎన్టీపీసీ, తాల్చేర్ ఫెర్టిలైజర్స్ వంటి సంస్థలు దరఖాస్తు సమర్పించాయి. యూరియా తయారీ కోసం అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడు ప్రతిపాదనలు చేసినట్లు కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మొత్తం 7 దరఖాస్తులు రాగా.. అందులో యూరియా ప్రాజెక్టుకు అదానీ గ్రూపు దరఖాస్తు చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది. సింథటిక్ నేచురల్ గ్యాస్‌కు- ఎన్‌టీపీసీ, సింథసిస్ గ్యాస్‌కు శ్యామ్ సెల్ ఁ పవర్ వంటి కంపెనీలు దరఖాస్తులు సమర్పించాయి. మొదటి దరఖాస్తుల విండో సెప్టెంబర్ 7న ముగియగా.. సెప్టెంబర్ 8 నుంచి రెండో దశ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇంధన అవసరాలకు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు, దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించాలని కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియకు కేంద్రం సంకల్పించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి మే నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే.






# వైట్ కాలర్ జాబ్స్ జోరు..

## హైదరాబాద్‌లో పెరిగిన అవకాశాలు

దేశంలో వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు బలమైన వృద్ధిని నమోదు చేశాయి. వార్షిక ప్రాతిపదికన ఆగస్టులో 14 శాతం నియామకాలు పెరిగాయని నౌకరీ.కామ్ నివేదిక వెల్లడించింది. గతేడాది ఇదే సమయంలో జాబ్‌స్పీక్ సూచీ 2,664గా ఉండగా.. ఆగస్టు నాటికి 3,028కి చేరింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో నియామకాలు జోరు అందుకున్నాయని నివేదిక తెలిపింది. కొత్త నియామకాలు, తమ ప్లాట్‌ఫాంలో ఉద్యోగ సెర్చ్ ఆధారంగా నెలవారీ నివేదికను నౌకరీ.కామ్ రూపొందించింది. ఆటో రంగంలో రికార్డు స్థాయిలో 19 శాతం వరకు వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు చేపట్టారు. హెల్త్‌కేర్- 16 శాతం, రిటెయిల్- 15 శాతం, ఇన్సూరెన్స్-12 శాతం, ఐటీ విభాగాల్లో-11 శాతం చొప్పున నియామకాలు జరిగాయి. ఐటీ సెక్టార్ పుంజుకోవడం, నాన్-ఐటీ రంగాలు వేగంగా విస్తరించడమే ఇందుకు కారణమని నివేదిక పేర్కొంది. 8-12 ఏళ్ల అనుభవం ఉన్న వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వారికి 16 శాతం మేర అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఫ్రెషర్లకు అవకాశం దక్కుతోంది. వీరిని 15 శాతం మేర నియమించుకున్నారు. నగరాల వారీగా చూస్తే.. హైదరాబాద్ 23 శాతం అధిక నియామకాలతో ముందు వరుసలో ఉంది. ఆ తర్వాత కోల్‌కతా, చెన్నై, బెంగళూరు వంటి నగరాలు ఉన్నాయి.




# పాక్‌కు షాకిచ్చిన అఫ్గాన్ క్రికెట్ బోర్డ్

భారత్‌తో జరగనున్న టీ20 సిరీస్ కోసం అఫ్గాన్ క్రికెట్ బోర్డు ఓ ప్రచార వీడియో రూపొందించింది. ఇందులో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిట్-బల్టిస్థాన్‌లను భారత్‌లో భాగంగా చూపింది. దీంతో ఇరుదేశాల మధ్య కొత్త దౌత్యపరమైన వివాదానికి తెరలేచింది. ఆ మ్యాప్‌పై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు.. పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో పాకిస్థాన్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక చర్యలకు దిగలేదు. అయితే, అంతర్జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని లేవనెత్తాలని చూస్తోంది. సరిహద్దు ఘర్షణలు, వైమానిక దాడులతో అఫ్గాన్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతోన్న తరుణంలో ఈ తాజా వివాదం తలెత్తింది. దేశంలో జరుగుతోన్న దాడులకు కారణమని పాకిస్థాన్ ఆరోపిస్తున్న తెహ్రిక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ కు అఫ్గాన్ తాలిబన్లు ఆశ్రయం కల్పిస్తున్నారని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. అఫ్గాన్, భారత్ మధ్య సెప్టెంబరు 13 నుంచి దిల్లీ వేదికగా మూడు టీ20ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌కు అఫ్గానిస్థాన్ ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తోంది.

# పట్టుబిగించిన ఈస్ట్ జోన్



దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖురైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారాయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారాయణ్ జగదీషన్ (32)ను శిఖర్ మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.



## ఇండియాతో చారిత్రాత్మక పోరుకు

# జపాన్ జట్టు ప్రకటన

ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్, ఐసీసీ నంబర్ వన్ ర్యాంకర్ అయిన టీమ్ ఇండియాతో సెప్టెంబర్ 22న టోచిగిలోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే చారిత్రాత్మక టీ20 సమరానికి జపాన్ క్రికెట్ బోర్డు.. తమ జట్టును అధికారికంగా అనౌన్స్ చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నివేదిక ప్రకారం, ఈ మ్యాచ్ ముగిసిన రెండు రోజులకే నగోయాలో ఆరంభమయ్యే స్వదేశీ ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన స్క్వాడ్‌నే ఈ మ్యాచ్ బరిలోకి దించుతున్నారు. జపాన్ తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు కెండల్ కడోవాకి-ఫ్లెమింగ్ ఈ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. అతడితో పాటు 50కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవజ్ఞులైన ఇబ్రహీం తకాహాషి, డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ జట్టులో కీలకం కానున్నారు. ఆసియా క్రీడల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును సెలెక్ట్ చేయడంతో, ఐసీసీ అర్హత ఉన్నప్పటికీ గేమ్స్ నిబంధనల పరిధిలోకి రాని కొంతమంది ఆటగాళ్లను తప్పించాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ పరిణామం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యువ స్పిన్ ఆల్‌రౌండర్ జేక్ కుసుద-నైర్న్‌కు మార్గం సుగమం చేసింది. 2013లో మొదటిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ ఆటగాడు సుయోషి తకాడా మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. స్కూల్ క్రికెట్ బుకాట్సు ప్రోగ్రామ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన వతారు మియాచి, మకోటో తానియామాలు ఈ లైనప్‌లో చోటు దక్కించుకున్నారు. ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ బౌలింగ్ వీడియోలు చూస్తూ లెగ్ స్పిన్ నేర్చుకున్న తానియామా, తన ఆరాధ్య క్రికెటర్ జెర్సీ నంబర్ 23 ధరించి ఆడనున్నారు. ఈ అరుదైన మ్యాచ్ భారత్, జపాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాల 75 సంవత్సరాల వేడుకల్లో భాగంగా 'స్పోర్ట్ 75' పేరుతో నిర్వహిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాల ప్రజల మధ్య క్రీడా సంబంధాలను విస్తరించడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. భారత్‌తో పోరుకు ముందు జపాన్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో రెండు టీ20లలో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో భాగంగా సెప్టెంబర్ 24న అఫ్గానిస్తాన్, 26న నేపాల్‌తో తలపడనుంది.మరోవైపు టీమ్ ఇండియా ఈ చారిత్రక పోరు కోసం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీలతో కూడిన దుర్భేధ్యమైన జట్టును ప్రకటించింది.

# భారత్ ను చూసి నేర్చుకోండి

## మిస్బా ఉల్ హక్ సూచన




పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న జట్టు నుంచి ఏడుమంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌లను ఆకస్మికంగా స్వదేశానికి రప్పించాలన్న బోర్డు నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలోనే ఆయన సెలెక్టర్ పదవికి సైతం రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సెలెక్షన్ కమిటీ సభ్యులందరికీ పీసీబీ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై మిస్బా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులలో కూడా హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించడం సరికాదని అన్నారు. ఓటమి ఎదురైన ప్రతిసారీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దకుండా తాత్కాలిక మార్పులకే బోర్డు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చే కోచ్‌లకు బోర్డు అపరిమితమైన అధికారాలను ఇస్తోందని, ఒకవేళ జట్టు విఫలమైనా వారిపై ఎలాంటి బాధ్యతను మోపట్లేదని మండిపడ్డారు. అదే సమయంలో సొంత కోచ్‌లకు మాత్రం కనీస మద్దతు ఇవ్వట్లేదని, ప్రతి చిన్న దానికి వారిని బోనులో నిలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను విదేశీ కోచ్‌ల నియామకాన్ని తప్పుబట్టట్లేదని, విదేశీ కోచ్‌ల పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ ఉంటోందని వ్యాఖ్యానించారు. అదే స్థానిక కోచ్‌ల విషయానికి వస్తే ప్రతి ఒక్కరూ వారిని విమర్శించడమే పనిగా పెట్టుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా భారత క్రికెట్ బోర్డు అనుసరిస్తోన్న విధానాలను మిస్బా ఉదహరించారు. భారత జట్టు ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానంలో కొనసాగడం వెనుక దశాబ్దాల కఠోర శ్రమ ఉందని అన్నారు.

# పీసీబీ ఇంకా వేల డాలర్లు బకాయి ఉంది

## పాక్ మాజీ కోచ్ జేసన్ గెలెస్పీ



ఆస్ట్రేలియా మాజీ బౌలర్ జేసన్ గిలెస్పీ 2024లో పాకిస్థాన్ టెస్టు కోచ్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. పాక్ కోచ్‌గా ఉన్నప్పుడు తనకు ఎదురైన చేదు అనుభవాలను తాజాగా గుర్తుచేసుకున్నాడు. పాక్ చీఫ్ సెలక్టర్ అకిబ్ జావేద్ తనను అగౌరవపరిచిన సంఘటనలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. కోచ్ పదవి కాలానికి సంబంధించి పీసీబీ తనకు ఇంకా వేల డాలర్లు బాకీ ఉందని పేర్కొన్నాడు. "అకిబ్ జావేద్‌ను చీఫ్ సెలక్టర్‌గా నియమించడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆ క్షణం నుంచే పాకిస్థాన్ క్రికెట్‌తో నాకున్న సంబంధం పూర్తిగా మారిపోయింది. ప్రతి విషయంలోనూ ఆయన పెత్తనమే కొనసాగింది. టెస్టు జట్టు బాధ్యతలు చూడటం, ఆటగాళ్లు, సిబ్బందిని పర్యవేక్షించడం, జట్టు ఎంపిక.. ఇలా ఏ విషయంలోనూ ఎటువంటి పాత్ర లేని స్థితికి వచ్చాను. ఆ అనుభవం నన్ను పూర్తిగా నిరుత్సాహపరిచి, కోచింగ్‌పై విరక్తి కలిగించింది. అది నాపై మానసికంగా ప్రభావం చూపింది. నన్ను నేను సందేహించుకునేలా చేసింది. అకిబ్ జావేద్ నా పట్ల పూర్తిగా అగౌరవంగా ప్రవర్తించాడు. అతడికి బోర్డు మద్దతు ఉంది. అందుకే తనను ఎవరూ ఏమీ చేయలేరని అనుకుంటున్నాడు. ప్రస్తుతం జరుగుతోన్న పరిణామాలను చూస్తుంటే చాలా బాధగా ఉంది. దీనికి అసలు కారకుడు అకిబ్ జావేద్. అతడు అక్కడ ఉన్నంత కాలం పాకిస్థాన్ క్రికెట్ వెనకడుగు వేస్తూనే ఉంటుంది" అని జేసన్ వివరించాడు.



# బంగారం, వెండికి మళ్లీ రెక్కలు..

## రూ.1.60లక్షలకు చేరువలో పసిడి ధర

దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు, డాలర్ విలువ తగ్గడం, చమురు మంటలతో ఈ లోహాలకు డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు దేశీయంగా పెళ్లిళ్ల సీజన్ వేళ గిరాకీ పెరగడంతో వీటి ధరలు పెరి గాయి. హైదరాబాద్ విపణిలో ఉదయం 10 గంటల ప్రాంతంలో 24 క్యారెట్ల మేలిమి పసిడి 10 గ్రాముల ధర రూ.1,58,900 పలికింది. క్రితం ముగింపుతో పోలిస్తే పుత్తడి దాదాపు రూ.4 వేల మేర పెరగడం గమనార్హం. ఇక, కేజీ వెండి ధర రూ.2,43,200 పలికింది. ఒక్క రోజే దీని ధర రూ.6వేల పైనే పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4435.20 డాలర్లకు చేరింది. ఔన్సు వెండి ధర 67 డాలర్లు పలికింది. కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లోనూ ఈ లోహాల ధరలు పెరిగాయి. గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాముల ధర రూ.1.53లక్షలు, సిల్వర్ ఫ్యూచర్స్ కేజీ ధర రూ.2.41లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలతో చమురు ధరలు వరుసగా మూడోరోజు పెరిగాయి. ఆసియా మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 97 డాలర్లు పలికింది. అటు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడికానున్న వేళ డాలర్ విలువ తగ్గింది. యూఎస్ డాలర్ సూచీ రెండు వారాల కనిష్ఠానికి పడిపోయింది. ఈ పరిణామాల వేళ బంగారంలో పెట్టుబడులు శ్రేయస్కరమని మదుపర్లు భావించడంతో ఈ లోహాలకు డిమాండ్ ఏర్పడింది. ఇదిలా ఉండగా.. ఈ వారంలో అమెరికా ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్, కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ గణాంకాలు వెల్లడి కానున్నాయి. ఫెడ్ వడ్డీరేట్లను నిర్ణయించడంలో ఇవి కీలకం కావడంతో మదుపర్లు వీటిపై దృష్టిసారించారు. దీంతో రాబోయే రోజుల్లో బంగారం, వెండి ధరలు మరింత ఊగిసలాటకు గురయ్యే అవకాశం ఉన్నట్లు బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి.




# నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబాయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితులు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, అమెరికా వడ్డీ రేట్లు పెంపు భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో రెండో సెషన్‌లోనూ సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 75,970.28 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,132.81) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో ఓ దశలో 75,553.35 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి 555.23 పాయింట్లు క్షీణించి 75,577.58 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144.05 పాయింట్లు కోల్పోయి 23,635.10 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.81గా ఉంది. సెన్సెక్స్ 30లో ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు ప్రధానంగా నష్టపోగా.. బీఈఎల్, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యునిలీవర్, ఇండిగో, హెచ్‌సీఎల్, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 98.39 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4,400.62 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# 'టాక్సిక్' కోసం భారీ ప్రాజెక్ట్ వదులుకున్న యశ్

యశ్‌కు ఇండియానా జోన్స్ లాంటి అడ్వెంచర్ కథ వినిపించానని.. కానీ, అది పట్టాలెక్కలేదని దర్శకుడు పీఎస్ మిత్రన్ తెలిపారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'సర్దార్ 2' సెప్టెంబర్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో.. యశ్‌కు వినిపించిన కథ గురించి పంచుకున్నారు. "యశ్‌కు నేను ప్రతిష్ఠాత్మక కథ వినిపించా. చాలా బలమైన ఎమోషన్స్ ఉన్నాయి. ఇండియానా జోన్స్ లాంటి అడ్వెంచర్ స్టోరీ. నా డ్రీమ్ ప్రాజెక్ట్. అది రూపొందించి ఉంటే చాలా అద్భుతంగా ఉండేది. కానీ, అప్పుడు యశ్‌కు సమయంలేక దాన్ని వదులుకున్నారు. దీంతో అది నెరేషన్ దగ్గరే ఆగిపోయింది" అని చెప్పారు. అడల్ట్ కంటెంట్‌తో కూడిన ఎమోషన్స్‌లేని గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాలో నటించడం కంటే.. భావోద్వేగాలు ఎక్కువగా ఉన్న అడ్వెంచర్ సినిమా ఎంపిక చేసుకుని ఉంటే బాగుండేదని పీఎస్ మిత్రన్ అభిప్రాయపడ్డారు. ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన 'టాక్సిక్' అభిమానులను నిరాశపర్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ డీల్‌పై రకరకాల వార్తలు వస్తున్నాయి. గతంలో ఈ సినిమా రైట్స్‌ను రూ.150కోట్లకు దక్కించుకొనేందుకు ప్రయత్నించిన ఓ సంస్థ ఇప్పుడు రూ.30కోట్లు మాత్రమే ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. సినిమా భారీ హిట్ అవుతుందని భావించిన చిత్రబృందం రూ.150కోట్ల డీల్‌ను అప్పుడు ఓకే చేయలేదని.. రూ.200కోట్లు డిమాండ్ చేసిందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం విడుదల

విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఆదర్శ కుటుంబం'.ఈ కాంబినేషన్ కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, బ్రహ్మాజీ, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అయితే గత కొన్ని రోజులుగా సినిమా రిలీజ్‌పై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వచ్చాయి. అప్‌డేట్స్ ఆలస్యం కావడంతో సినిమా అక్టోబర్ 2న విడుదల కాకపోవచ్చనే ప్రచారం జరిగింది. అక్టోబర్ 16కు వాయిదా పడుతుందనే వార్తలు కూడా వినిపించాయి. దీంతో వెంకీ అభిమానుల్లో సందేహాలు మొదలయ్యాయి.ఈ రూమర్లకు నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెక్ పెట్టారు. అప్‌డేట్స్ ఆలస్యమైనందుకు అభిమానులకు క్షమాపణలు చెప్పారు. అదే సమయంలో 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తుందని స్పష్టం చేశారు. గాంధీ జయంతితో పాటు దసరా సెలవులు కూడా కలిసిరావడంతో ఈ రిలీజ్ డేట్ సినిమాకు ప్లస్ అయ్యే అవకాశం ఉంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కావడంతో పండుగ సీజన్‌లో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందని మేకర్స్ భావిస్తున్నారు.

# నగ్నంగా నిలబెట్టేవారు..



సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్, నటి సందీపా విర్క్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత భయానకమైన దినాలను గుర్తుచేసుకుని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రూ.6 కోట్ల మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి సందీపా విర్క్ దాదాపు నాలుగున్నర నెలల పాటు ఢిల్లీలోని తీహార్ జైలులో గడపాల్సి వచ్చింది. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సందీపా విర్క్.. జైలులో తాను అనుభవించిన దారుణ పరిస్థితులను, అవమానాలను బయటపెట్టారు. జైలులో ఖైదీలను తనిఖీ చేసే పద్ధతి అత్యంత అమానుషంగా ఉంటుందని సందీపా చెప్పుకొచ్చారు. లోపలికి వెళ్లగానే సిబ్బంది బట్టలు విప్పించి ప్రైవేట్ పార్టులపై టార్చ్ లైట్ వేసి తనిఖీ చేస్తారని.. చలికాలంలోనూ ఇష్టారీతిన దుస్తులు తొలగించి అవమానిస్తారని వాపోయారు. ఇంత కఠినంగా శరీరాన్ని తనిఖీ చేస్తున్నప్పుడు జైలు లోపలికి మొబైల్ ఫోన్లు, డ్రగ్స్ ఎలా వస్తున్నాయని ఆమె ప్రశ్నించారు. జైలులో డబ్బు ఉంటే ఏదైనా సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక రోజులోనే రెండు మూడు సార్లు దుస్తులు ఊడదీసి తనిఖీలు చేసేవారని.. ఆ వందలాది తనిఖీల సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని సందీపా విర్క్ వెల్లడించారు. "మహిళా సిబ్బందే కదా చూస్తోంది, దుస్తులు తీస్తే తప్పేంటి?" అని కొందరు తేలికగా మాట్లాడుతున్నారని సందీపా విర్క్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా జైలులోని ఆహారం, టాయిలెట్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండేవని.. మొదటిరోజే తనను 25-26 మంది ఉన్న గదిలో నెట్టివేశారని సందీపా విర్క్ గుర్తుచేసుకున్నారు.






# అలియా ప్రేమయుద్ధం ముగిసింది



'ఆల్ఫా'తో ఇటీవలే గూఢచారి పాత్రలో తెరపై సాహసాలు చేసింది బాలీవుడ్ కథానాయిక అలియా భట్. ఇప్పుడామె ప్రేమికురాలిగా అలరించడానికి సిద్ధమైంది. ఆమె, రణ్‌బీర్ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్నారు. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ ముగిసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్ని వేగవంతంగా పూర్తి చేసే పనిలో చిత్రబృందమని సమాచారం. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రేమ, యుద్ధం, భావోద్వేగాలు లాంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని, త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడించడానికి సన్నాహాలు చేస్తున్నారని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ రొమాంటిక్ వార్ డ్రామా వచ్చే ఏడాది థియేటర్లలోకి రాబోతుంది.

## ఓటీటీలో బ్లాక్‌బస్టర్ మూవీ 'విశ్వనాథ్ అండ్ సన్స్'

సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన బ్లాక్‌బస్టర్ మూవీ 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితా బైజు కథానాయిక. రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఆగస్టు 14న థియేటర్స్‌లో విడుదలైన ఈ మూవీ ఘన విజయాన్ని అందుకుంది. యువతతో పాటు, మహిళలూ ఈ మూవీకి ఫిదా అయ్యారు. ముఖ్యంగా సూర్య, మమితబైజుల నటన, వెంకీ అట్లూరి టేకింగ్ సినిమాను విజయపథంలో నడిపాయి. ఇప్పటివరకూ ఈ మూవీ రూ.260 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి 'విశ్వనాథ్ అండ్ సన్స్' సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో సెప్టెంబరు 11 నుంచి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

# 'ఫౌజీ' సెట్ లో ప్రమాదం జరగలేదు



ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా 'సీతా రామం' వంటి విజయం తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమా 'ఫౌజీ' . ఆల్రెడీ విడుదలైన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. సినిమాపై పాజిటివ్ బజ్ నెలకొంది. అది పక్కన పెడితే... కొన్ని నెలల క్రితం ఈ సినిమా షూటింగ్ చేసేటప్పుడు బాలీవుడ్ నటుడు రాజేష్ శర్మను ఓ కీటకం (విష పురుగు) కుట్టడంతో అనారోగ్యానికి గురి అయ్యారని, ఆయన ఆసుపత్రి పాలయ్యారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. ఆ వార్తల్లో నిజం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అసలు నిజాలను బయట పెట్టారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రభాస్ సినిమా 'ఫౌజీ' షూటింగ్ పూర్తి చేసుకుని దట్టమైన చెట్ల మధ్య టెక్నీషియన్లతో రాజేష్ శర్మ మాట్లాడుతున్న సమయంలో ఆయన్ను ఓ కీటకం కుట్టిందని జూలై నెలలో బెంగాలీ యాక్టర్ సుదీప ఛటర్జీ తెలిపారు. అప్పట్లో అది పెద్ద సమస్యగా అనిపించలేదని, దాంతో రాజేష్ శర్మ నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. చిత్రీకరణ ముగిసిన ఆరు గంటలకు కాలులో తీవ్రమైన నొప్పి కలగడంతో కోల్‌కతాకు ప్రయాణిస్తున్న విమానంలో రాజేష్ శర్మకు విపరీతమైన జ్వరం వచ్చిందని, పరిస్థితి విషమించడంతో కోల్‌కతాలోని మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించినట్లు సుదీప ఛటర్జీ వివరించారు.

## త్రిష నుంచి వచ్చిన మెసేజ్ ఇదే

### మాళవిక మోహనన్

ఇండస్ట్రీలో త్రిష లాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారన్నారు నటి మాళవిక మోహనన్. కొత్త వాళ్లను ఆమె ఎంతో ప్రోత్సహిస్తారని తెలిపారు. 'సర్దార్ 2' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాళవిక మాట్లాడుతూ త్రిషతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ ప్రధానపాత్రలో తెరకెక్కిన 'పేట' సినిమాలో ఆమెతో కలిసి వర్క్ చేసిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఆమె తనను ఎంతో ఆప్యాయంగా పలకరించారని తెలిపారు. "నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో 'పేట' అవకాశం వచ్చింది. రజనీకాంత్ సినిమా కావడంతో ఎంతో ఆనందించా. కానీ, కమర్షియల్ సినిమా చేసిన అనుభవం లేకపోవడంతో కంగారుపడ్డాను. వారణాసిలో షూటింగ్ జరిగిన వేళ త్రిషతో కలిసి కొన్ని కాంబినేషన్ సీన్లలో నటించాను. అప్పుడే తనతో పరిచయం ఏర్పడింది. ఎంతో బాగా చూసుకున్నారు. ప్రతి విషయంలోనూ నన్ను భాగం చేసేవారు. పరిశ్రమలో చాలా మంది ఎవరి పని వారు చేసుకొని వెళ్లిపోతారు. కానీ, త్రిష కొత్తవారిపై కూడా ఆదరణ చూపిస్తారు. చాలా తక్కువ మంది మాత్రమే అలా చేయగలరు". "ఆ తర్వాత విజయ్‌కు జోడీగా నాకు 'మాస్టర్' సినిమాలో అవకాశం వచ్చినప్పుడు త్రిష స్పెషల్ మెసేజ్ పంపారు. 'బేబీ నీకు ఇంత పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. అలా అభినందించడానికి పెద్ద మనసు కావాలి" అంటూ త్రిషపై మాళవిక ప్రశంసలు కురిపించారు. కెరీర్ కీలక మలుపు తిరిగే సమయంలోనూ త్రిష ఇచ్చిన ప్రోత్సాహం తనకెంతో ప్రత్యేకమని అన్నారు. 2021లో విడుదలైన 'మాస్టర్' విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఇక మాళవిక నటించిన తాజా చిత్రం 'సర్దార్ 2' సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com